- aruhi group
www.mahaaprabha.com

# నమస్తే మహాప్రభ

ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ

తెలుగు దినపత్రిక

శనివారం
02-05-2026

సంపుటి : 01 సంచిక :41 పేజీలు : 08 వెల : ₹5/- తెలంగాణ , ఆంధ్రప్రదేశ్.

Published From RANGAREDDY TELANGANA.RNI NO : TGTEL/26/A0738 VOLUME 01 ISSUE 41 NAMASTEY MAHAAPRABHA



Mr. NAKKA RAJU
Chairman of Mahaaprabha

## భారత్‌పై భారీ ఉగ్రదాడికి

# పాక్ కుట్ర!


### అధ్యక్ష పీఠంపై అసిమ్ మునీర్ కన్ను..


- జమ్మూకాశ్మీర్‌లో భారీ ఉగ్రదాడికి పాకిస్థాన్ సైన్యం కుట్ర పన్నుతున్నట్లు నిఘా వర్గాల సమాచారం
- భారత్ ప్రతీకార దాడి చేసేలా రెచ్చగొట్టి, కశ్మీర్ అంశాన్ని అంతర్జాతీయం చేయడమే అసలు లక్ష్యం
- పాక్ సైన్యాధ్యక్షుడు అసిమ్ మునీర్ తన అధ్యక్ష పదవి ఆకాంక్ష కోసమే ఈ ప్లాన్ చేస్తున్నట్లు విశ్లేషణలు
- స్థానిక యువతతో దాడులు చేయించి, తర్వాత పాక్ ఉగ్రవాదులను భారత్‌లోకి పంపేందుకు రెండంచెల వ్యూహం

న్యూఢీల్లీ మే1 (మహాప్రభ)
భారత గడ్డపై మరో భారీ ఉగ్రదాడికి పాకిస్థాన్ కుట్ర పన్నుతోందని, ఈసారి జమ్మూకశ్మీర్‌ను లక్ష్యంగా చేసుకుని విధ్వంసం సృష్టించేందుకు సిద్ధమవుతోందని విశ్వసనీయ నిఘా వర్గాలు హెచ్చరిస్తున్నాయి. భారత్‌ను ప్రతీకార దాడులకు పురిగొల్పి, ఆ తర్వాత అమెరికా వంటి దేశాల జోక్యాన్ని కోరడం ద్వారా కశ్మీర్ అంశాన్ని అంతర్జాతీయ వేదికపైకి తీసుకెళ్లాలనేది పాక్ పన్నాగంగా కనిపిస్తోంది. ఈ మొత్తం వ్యూహం వెనుక పాక్ సైన్యాధ్యక్షుడు ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్ వ్యక్తిగత,

-మిగతా 3లో







## ధరలపై తాము

# ముందే చెప్పాం

- ఎన్నికల తరువాత ధరాభారం పెరుగుతుందని
- పెట్రో, డీజిల్ బాదుడుకు సిద్ధంగా ఉండాలి
- గ్యాస్ ధర పెంపుపై రాహుల్ విమర్శలు

న్యూఢిల్లీ, మే1 (మహాప్రభ)
దేశంలో వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరలు రూ.993 మేర పెరగడంపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. త్వరలో పెట్రోల్, డీజిల్ వంతు వస్తుందని హెచ్చరించారు. ఎన్నికల తరువాత ధరాభారం పెరుగుతుందని తాను ముందే చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. ఇది ఎలక్షన్ బిల్లు అని వ్యాఖ్యానించారు. ఎక్స్ వేదికగా ఈ మేరకు పోస్టు పెట్టారు. కమర్షియల్ ఎల్‌పీజీ సిలిండర్ ధర మునుపెన్నడూ చూడని స్థాయిలో ఒక్కసారిగా పెరిగాయని రాహుల్ గాంధీ విమర్శించారు. ఫిబ్రవరి నుంచి ఇప్పటివరకూ రూ.1380ల మేర ధర పెరిగిందని అన్నారు. కేవలం మూడు నెలల్లోనే ధర 81 శాతం మేర పెరిగిందని వివరించారు. ఎన్నికల తరువాత ఇలా జరుగుతుందని తాను ముందే చెప్పానని గుర్తు చేశారు. 'టీ స్టాల్స్, ధాబాలు, బేకరీ, స్వీట్ షాపులు.. ఇలా అందరిపైనా భారం పెరిగింది. చివరకు మీ ఆహార ఖర్చులపైనా ప్రభావం పడుతుంది. మొదట ఎల్‌పీజీ గ్యాస్ వంతు.. ఆ తరువాత పెట్రోల్-డీజిల్ ధరల వంతు వస్తుంది' అని అన్నారు. ఎన్నికలు ముగిశాక దేశంలో పెట్రోల్

-మిగతా 3లో



## రాష్ట్రంలో కార్మిక

# వ్యతిరేక ప్రభుత్వం

- సిగాచిలో 60 మంది చనిపోతే దిక్కులేకుండా పోయింది
- 120మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలకు పాల్పడ్డారు
- కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్న రేవంత్ సర్కార్
- బిఆర్‌ఎస అధికారంలో ఉండగా కార్మిక సంక్షేమాన్ని అమలు చేశాం
- మరో రెండేళ్లు ఆగితే మళ్లీ అధికారం బిఆర్‌ఎస్ పార్టీదే
- మేడు ఉత్సవాల్లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్,, మే1 (మహాప్రభ)
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్మిక రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. సరైన పని దినాలు, వసతులు కల్పించక ఇబ్బందులపాలు చేస్తున్నారని విమర్శించారు. అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ జెండాను ఎగురవేసి మేడే శుభాకాంక్షలు తెలిపారు.సఫాయిల శ్రమను.. సీఎం రేవంత్‌రెడ్డి గుర్తించడం లేదు. ప్రస్తుతం రాష్ట్రంలో కార్మిక వ్యతిరేక సర్కార్ నడుస్తోంది. ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు కాంగ్రెస్ బాధితులయ్యారు. మంత్రుల జీతాల్లో కోత వేసి ఇస్తామనడానికి వాళ్లు వరద బాధితులా అని అన్నారు. రాష్ట్రంలో 120 మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్య

-మిగతా 3లో

## కవిత భయంతో మేల్కొన్న కేసీఆర్

- కబ్జాలను తొలగిస్తున్న హైడ్రాపై అక్కసా
- పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్

హైదరాబాద్,
కవిత భయం వల్లే కేసీఆర్ బయటకు వస్తున్నారని పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ అన్నారు. ఈ మేరకు తెలంగాణ రక్షణ సేన (టీఆర్‌ఎస్) అధ్యక్షురాలు కవితకు మహేశ్ గౌడ్ థాంక్స్ చెప్పారు. కవిత వల్లే మాజీ సీఎం, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ మేల్కొంటున్నారని వ్యాఖ్యానించారు.

-మిగతా 3లో





## ఇరాన్‌పై మళ్లీ భీకర దాడులు..

# సిద్ధమవుతున్న అమెరికా

- 24 గంటల్లోనే ఇజ్రాయెల్‌కు 6,500 టన్నుల ఆయుధ సామగ్రి
- ఇరాన్‌ను చర్చలకు రప్పించడమే లక్ష్యం

3లో






# నేడు మీ ఫోన్‌కు అలర్ట్..

- ఉదయం 11:15 నుంచి 12:15 గంటల మధ్య మొబైల్స్‌కు పరీక్షా సందేశాలు
- జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ ఆధ్వర్యంలో ఈ ట్రయల్ రన్
- ఇది కేవలం పరీక్షేనని, ప్రజలు ఆందోళన చెందవద్దని అధికారుల సూచన
- విపత్తుల సమయంలో ప్రజలను అప్రమత్తం చేయడమే ఈ వ్యవస్థ లక్ష్యం

న్యూఢీల్లి మే1 (మహాప్రభ)
మీ మొబైల్ ఫోన్ ఒక్కసారిగా పెద్ద శబ్దంతో మోగుతూ, స్క్రీన్‌పై జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ నుండి ఏదైనా సందేశం కనిపిస్తే అస్సలు కంగారు పడకండి. అది ఎటువంటి ప్రమాద హెచ్చరిక కాదు, ప్రభుత్వం చేపట్టిన ఒక కీలకమైన పరీక్ష మాత్రమే. దేశవ్యాప్తంగా విపత్తుల సమయంలో ప్రజలను అప్రమత్తం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం 'సెల్ బ్రాడ్కాస్ట్ అలర్ట్' వ్యవస్థను పరీక్షిస్తోంది. సునామీలు, భూకంపాలు, పిడుగుపాట్లు లేదా గ్యాస్ లీకేజీల వంటి అత్యవసర సమయాల్లో లక్షలాది మంది ప్రజలకు క్షణాల్లో సమాచారాన్ని చేరవేయడం ఈ వ్యవస్థ ముఖ్య ఉద్దేశ్యం. దీని ద్వారా విపత్తు సంభవించే ముందే ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లే అవకాశం కలుగుతుంది. ప్రభుత్వం స్వదేశీ సాంకేతికతతో రూపొందించిన ఈ 'సెల్ బ్రాడ్కాస్ట్ సిస్టమ్' పనితీరును

-మిగతా 3లో

## జూన్2 నాటికి జర్నలిస్ట్‌ల ఇళ్ల స్థలాల సమస్యకు

# పరిష్కారం

### న్యాయపరమైన చిక్కుల్లేకుండా ఇళ్లస్థలాలు

- జర్నలిస్ట్‌ల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉంది
- గతంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వాంనిదే
- ఎమ్మెల్యేలు, బ్యూరో క్రాట్స్‌తో పాటే అందరికీ స్థలాలు
- ఫ్యూచర్‌సిటీలో ఇవ్వడానికి సిఎం రేవంత్ అంగీకారం
- జర్నలిస్ట్ సంఘాలతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్, మే1 (మహాప్రభ)
అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిజాయితీ, చిత్తశుద్ధితో ఉందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే పలు సందర్భాలలో ఇచ్చిన హామీల మేరకు అందరి అభిప్రాయాలను సేకరించి వచ్చేనెల 2వ తేదీనాటికి ఒక కొలిక్కి తీసుకువస్తామని వెల్లడించారు. శుక్రవారం సచివాలయంలోని తన ఛాంబర్‌లో జవహర్‌లాల్ నెహ్రూ హౌసింగ్, జర్నలిస్ట్స్ హౌసింగ్, డెక్కన్ జర్నలిస్ట్స్ , తెలంగాణ హౌసింగ్ సొసైటీలతో మంత్రి సమావేశం నిర్వహించారు. హైదరాబాద్ కేంద్రంగా ఉన్న జర్నలిస్టు హౌసింగ్ సొసైటీలు ఎప్పుడు ఏర్పాటయ్యాయి,

-మిగతా 3లో



## ఢిల్లీ క్యాపిటల్స్

# ధమాకా

- హ్యాట్రిక్ ఓటములకు ఢిల్లీ క్యాపిటల్స్ బ్రేక్
- రాజస్థాన్ రాయల్స్‌పై 7 వికెట్ల తేడాతో విజయం
- పాయింట్స్ టేబుల్‌లో ఆరో స్థానానికి చేరిక



న్యూఢీల్లీ మే1 (మహాప్రభ)
ఐపీఎల్ 2026లో హ్యాట్రిక్ ఓటములకు ఢిల్లీ క్యాపిటల్స్ బ్రేక్ వేసింది. శుక్రవారం రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచులో ఏడు వికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ రాయల్స్.. 225/6 పరుగులు చేసింది. అనంతరం ఢిల్లీ క్యాపిటల్స్ 19.1 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. దీంతో పాయింట్స్ టేబుల్‌లో ఏడో ప్లేసు నుంచి ఆరో స్థానానికి చేరింది. మరోవైపు ఈ మ్యాచులో ఓడినా.. రాజస్థాన్ రాయల్స్ పాయింట్స్ టేబుల్‌లో నాలుగో స్థానాన్ని నిలుపుకుంది. ఈ మ్యాచులో తొలుత బ్యాటింగ్ చేసిన ఢిల్లీ క్యాపిటల్స్ ఓ దశలో 12 పరుగులకే 2 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ సమయంలో కెప్టెన్ రియాన్ పరాగ్..

-మిగతా 3లో



## భగ్గుమన్న కమర్షియల్

# సిలిండర్ ధర

- 19 కిలోల సిలిండర్‌పై రూ.993 పెంపు
- హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లపై తీవ్ర భారం

న్యూఢిల్లీ, మే1 (మహాప్రభ)
పశ్చిమాసియా ఉద్రిక్తతలు ప్రపంచ ఇంధన మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఈ పరిణామాల ప్రభావం భారత్‌పై స్పష్టంగా కనిపిస్తోంది. ఇందనం సరఫరాలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. చమురు నౌకలను దిగ్బందించారు. ఈ క్రమంలో కొరత అనివార్యంగా మారింది. ఈ క్రమంలో ముఖ్యంగా వాణిజ్య అవసరాల కోసం ఉపయోగించే 19 కిలోల ఎల్పిజీ గ్యాస్ సిలిండర్ ధర భారీగా పెరిగింది. దీంతో హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు,

-మిగతా 3లో

# తప్పుడు కథనాలు రాయొద్దు

## అషురెడ్డి కేసులో హైకోర్టు ఆదేశాలు



- మీడియాకు, కంటెంట్ క్రియేటర్లకు హైకోర్టు సూచన
- కొన్ని రోజులుగా వివాదంలో చిక్కుకున్న అషురెడ్డి
- నిరాధార వార్తలను ప్రసారం చేయవద్దన్న హైకోర్టు
- అషు ప్రైవసీని గౌరవించాలన్న న్యాయస్థానం

హైదరాబాద్, మే1 (మహాప్రభ)
సినీ నటి అషురెడ్డి చుట్టూ కొద్దిరోజులుగా నెలకొన్న వివాదంలో తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు ఆమెకు పెద్ద ఊరటనిచ్చింది. సోషల్ మీడియా, కొన్ని మీడియా సంస్థల్లో తనపై వస్తున్న

-మిగతా 3లో

# తుమ్మిడిహట్టికి... సీఎం రేవంత్


- ఈ నెల 7న ప్రతిపాదిత బ్యారేజీ నిర్మాణ ప్రాంత పరిశీలన
- 148 నుంచి 150 మీటర్ల ఎత్తులో నిర్మించే ప్రతిపాదన
- ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లలో అధికారులు



హైదరాబాద్, మే1 (మహాప్రభ)
కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో భారీ ప్రాజెక్టు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. జిల్లాలోని కౌటాల మండలం తుమ్మిడిహట్టి వద్ద ప్రతిపాదిత బ్యారేజీ నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల 7వ తేదీన పర్యటించనున్నారు. తెలంగాణ సాగునీటి రంగంలో కీలకమైన తుమ్మిడిహట్టి బ్యారేజీని 148 నుంచి 150 మీటర్ల ఎత్తులో నిర్మించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ ప్రాజెక్టు ద్వారా జిల్లాలోని వేలాది ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యంగా భావిస్తోంది. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయిలో పరిస్థితులను సమీక్షించేందుకు ముఖ్యమంత్రి స్వయంగా రానున్నారు.

-మిగతా 3లో

# 2025లో ఎలాన్ మస్క్ వేతనం రూ.15 లక్షలు కోట్లు..



**న్యూఢిల్లీ: మే 1 ( మహాప్రభ )**
టెస్లా ఇంక్ అధినేత ఎలాన్ మస్క్ 2025 ఆర్థిక సంవత్సరానికిగాను 158 బిలియన్ డాలర్ల వేతన ప్యాకేజీని పొందారు. ఈ మేరకు రెగ్యులేటరీ ఫైలింగ్ లో ఆయన ప్యాకేజీని కంపెనీ పేర్కొన్నది. భారత కరెన్సీ లో ఇది దాదాపు రూ.15 లక్షల కోట్లుగా ఉన్నది. ఎలాన్ మస్క్ నెలవారీ వేతనంగా ఎలాంటి మొత్తాన్ని పొందడం లేదు. స్టాక్ అవార్డులు, ఇతరత్రా రూపంలో పారితోషిక ప్యాకేజీని అందుకుంటారు. ఈ క్రమంలో 2025 సంవత్సరానికిగాను ఆయన ప్యాకేజీని టెస్లా ప్రకటించింది.అయితే ప్రకటించిన మొత్తంతో పోలిస్తే ఆయన పొందే విలువకు చాలా వ్యత్యాసం ఉంటుందని కూడా టెస్లా తన ఫైలింగ్‌లో తెలిపింది. కంపెనీ పనితీరు ఆధారిత పారితోషికం విలువ 132 బిలియన్ డాలర్లుగా ఉన్నది. పనితీరు విషయంలో కంపెనీ నిర్దేశించిన లక్ష్యాలు నెరవేరితేనే ఈ మొత్తం మస్క్‌కు అందుతుంది. అలాగే ప్యాకేజీలో మిగతా 26 బిలియన్ డాలర్లు కూడా టెస్లా బోర్డు ఆమోదిస్తేనే అందుతుంది.

# కర్ణాటక సీఎం పదవిపై కన్ఫ్యూజన్‌కు త్వరలో తెర



**న్యూఢిల్లీ: మే 1 ( మహాప్రభ )**
కర్ణాటక లో నాయకత్వ మార్పుపై ఏఐసీసీ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు మల్లికార్జున ఖర్గే మరోసారి స్పందించారు. కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పు ఉండబోదని తెలిపారు. నాయకత్వ సమస్యపై నెలకొన్న గందరగోళాన్ని పార్టీ అధిష్ఠానం కూడా త్వరలోనే నివృత్తి చేస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. సిద్ధరామయ్య సీఎంగా కొనసాగుతారని, మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ ఉండవచ్చని చెప్పారు.కర్ణాటక కాంగ్రెస్ నాయకులు తనను, పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌ను కలిసి వారి అభిప్రాయాలను పంచుకున్నారని తెలిపారు. లోక్‌సభలో ఏఐసీసీ అగ్రనాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలు సరైన సమయంలో ఈ అంశంపై చర్చించి నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. ఇదిలావుంటే మల్లికార్జున ఖర్గే ముఖ్యమంత్రి పదవి చేపడితే స్వాగతిస్తామని కర్ణాటక హోంమంత్రి జీ పరమేశ్వర అన్నారు. ఈ ప్రకటనపై కూడా ఖర్గే స్పందించారు. ముఖ్యమంత్రి కుర్చీ ఖాళీగా లేదని, కాబట్టి అలాంటి చర్చకు తావులేదని స్పష్టంచేశారు.

# ముంబైలో భారీగా కొకైన్ పట్టివేత..



**న్యూఢిల్లీ: మే 1 ( మహాప్రభ )**
ముంబైలో లో అంతర్జాతీయ డ్రగ్స్ ముఠాను నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో ఛేదించింది. ఆ ముఠా నుంచి రూ.1,745 కోట్ల విలువైన కొకైన్‌ను ఎన్‌సీబీ స్వాధీనం చేసుకుంది. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఎక్స్ ద్వారా ఈ విషయాన్ని వెల్లడించారు. మాదకద్రవ్యాల రవాణాకు పాల్పడే ముఠాలను అణచివేయాలని నిర్ణయించుకున్నట్లు అమిత్‌షా తెలిపారు. ఇందులోభాగంగా.. నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో అంతర్జాతీయ డ్రగ్స్ ముఠాపై ఉక్కుపాదం మోపిందన్నారు.ముంబైలో రూ.1,745 కోట్ల విలువైన 349 కిలోల కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వెల్లడించారు. ఒక చిన్న సరకును గుర్తించి.. దాని నుంచి ఒక భారీ నెట్‌వర్క్‌ను పట్టుకున్నట్లు తెలిపారు. ఈ విజయానికిగాను ఎన్‌సీబీ బృందాన్ని ఆయన అభినందించారు. కాగా అండర్‌వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీం అనుచరుడు సలీమ్ డోలాను ఇటీవల తుర్కియే నుంచి భారత్‌కు తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో ఇంత పెద్ద మొత్తంలో డ్రగ్స్ స్వాధీనం చేసుకోవడం గమనార్హం.

# యూనివర్సిటీలో ఉడుత బీభత్సం..

## 6 వారాల్లో 20 మందిని కరిచింది



**జైపూర్ మే 1 ( మహాప్రభ )**
రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో ఉన్న మోహన్‌లాల్ సుఖదియా యూనివర్సిటీలో విచిత్ర పరిస్థితి ఎదురైంది. ఆ వర్సిటీలో ఓ ఉడుత చాలా క్రూరంగా ప్రవర్తిస్తోంది. గడిచిన ఆరు వారాల్లో ఆ ఉడుత సుమారు 20 మందిని కరిచినట్లు తెలిసింది. ఆర్ట్స్ కాలేజీలోని సైకాలజీ డిపార్ట్‌మెంట్ వద్ద ఆ ఉడుత విద్యార్థులు, సిబ్బందిని టార్గెట్ చేస్తున్నది. ఇటీవల ఆ వర్సిటీ డీన్‌పైన కూడా దాడి చేసింది. ఉగ్రంగా మారిన ఆ ఉడతను చూసి ఇప్పుడు విద్యార్థులు, స్టాఫ్ భయపడుతున్నారు. సైకాలజీ డిపార్ట్‌మెంట్ వైపు వెళ్లాలంటే వణుకుతున్నారు. డిపార్ట్‌మెంట్ సమీపంలో గూడు ఏర్పాటు చేసుకున్న ఉడుత.. అటు వైపు నుంచి ఎవరు వచ్చినా వారిపై దాడి చేస్తున్నది.దీంతో ప్రస్తుతం వర్సిటీ సిబ్బంధి హై అలర్ట్‌లో ఉంటున్నారు. ఆ ఉడుతను పట్టుకునేందుకు రెండుసార్లు కేజ్‌లను పెట్టారు. కానీ తెలివైన ఆ జంతువు వాటి నుంచి తప్పించుకున్నది. ఉడుత కరిస్తే రేబిస్ రాదు, కానీ టెటానస్ ఇంజెక్షన్ ఇప్పించుకోవాలని డాక్టర్ శైలేంద్ర కుమార్ తెలిపారు.పాక్షికంగా కంటి చూపు మందగించినా లేక ఎక్కువ రంగుల వల్ల చికాగుకు లోనైనా జంతువుల ప్రవర్తన దూకుడుగా మారుతుందని ఆ డాక్టర్ చెప్పారు.

# శ్రీ శ్రీ గురు విశ్వ స్ఫూర్తి జన్మదిన సందర్భంగా ఉచిత వైద్య శిబిరం....



**బండ్లగూడ,మే 1 (మహాప్రభ)**
శ్రీశ్రీశ్రీ గురు విశ్వస్ఫూర్తి వారి దివ్య ఆశీస్సులతో ధ్యానమనోప్రస్థానమ్ బండ్లగూడ జాగీర్ నందు గురువుగారి జన్మదిన వేడుకలు ఆత్మీయత దినోత్సవముగా శుక్రవారం ఘనంగా నిర్వహించడం జరిగింది. ముఖ్య అతిథులుగా ఆచార్య గౌరీ శంకర్ మాట్లాడుతూ ఆత్మీయత దినోత్సవము శుభాకాంక్షల తో పాటు, ప్రత్యేకత వివరించారు.
కార్యక్రమంలో భాగంగా గురువు గారు సూచించిన ప్రస్థాన ధ్యానం -- ఆసన, ప్రాణాయామ ధ్యానము నిర్వహించారు. అర్హులైన పేదలకు ఉచిత వైద్య శిబిరం, పేద విద్యార్థులకు సైకిళ్లు. పేదలకు వస్త్ర బహూకరణ,అనంతరం దాదాపు 650 మంది భక్తులు కార్యక్రమానికి హాజరైన వారందరూ గురువుగారి దివ్య ఆశీస్సులు తీసుకొని మహా ప్రసాదం స్వీకరించారు.
మొలకతోనే ప్రారంభం, చెట్టుకు సంబంధించినది ఏదైనా! అలాగే, పుట్టుకతోనే ఆరంభం,ఒకే పేరున వున్న చెట్లు,మొక్కలు వగైరా,ఒకే సారమున కలిగివుంటాయి. కాని, జాతిపరంగ, మానవులంతా ఒకటే అయినా, స్వభావం, వ్యక్తిగత భిన్నతే.. భావం,భాష, ఆలోచన యోచన కలిగిన,మనిషి ప్రత్యేకత అదే. కనుక, వ్యక్తి మంచి –చెడుకు వ్యక్తిగత బాధ్యత లేదనుకోవాలా?ఏ మనిషీ,తన జన్మకు తాను కారణం కాకపోయినా, దానితో అనుభవం తనదే సుమా! అనుభవాన్ని మంచిగా మార్చుకునే అవకాశం, ఆలోచన, మనిషికి అవసరం. అలాగే జీవితాన్ని గొప్పగా, ప్రత్యేక కలిగినదిగా, తయారించుకునే బాధ్యత, మనిషిదే! మనిషి వలన, మనిషి చేత, మనిషి కొరకే...' అనడం, అందుకోసమే! అందుకు,తానుగా చేయవలసిన, చేయదగిన దానిని ప్రతివారు,తాము పుట్టిన రోజునే, తమ క్రొత్త క్యాలండరు, ఆరంభం రోజునే ప్రారంభించండి. బర్త్డేగుర్తుగా, తమలో ఏదైనా చెడు అలవాటు వుంటే దానిని వదిలేయండి. అలాగే,దాని స్థానంలో,మంచిని తమలోకి చేర్చుకోండి.మనోధైర్యం, ఆత్మవిశ్వాసం, శ్రమదీక్ష సత్ఫలితాన్నిస్తాయి.మనిషి–మనసు మధ్య,సఖ్యత, సామరస్యతకు యోగ సాధన, ధ్యానమనోప్రస్థానం, మేలు చేస్తుంది.

# నేను అందుకే బుల్లెట్ ప్రూఫ్ జాకెట్ ధరించను




**న్యూఢిల్లీ: మే 1 ( మహాప్రభ )**
అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాను బుల్లెట్ ప్రూఫ్ జాకెట్ ధరించకపోవడానికి కారణాన్ని వెల్లడించారు. బుల్లెట్ ప్రూఫ్ జాకెట్ ధరిస్తే తాను లావుగా కనిపిస్తానని, అందుకే బహిరంగ కార్యక్రమాల్లో దానిని ధరించనని ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కాగా ట్రంప్‌పై పలుమార్లు హత్యాప్రయత్నాలు జరిగాయి. అయినప్పటికీ బుల్లెట్ ప్రూఫ్ జాకెట్ ధరించకపోవడంపై చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో ఓవల్ కార్యాలయంలో జరిగిన ఓ సమావేశంలో ఒక మీడియా ప్రతినిధి ట్రంప్‌ను ప్రశ్నించారు.తాను బుల్లెట్ ప్రూఫ్ జాకెట్ ధరిస్తే 20 పౌండ్ల బరువు పెరిగినట్లుగా కనిపిస్తానని, ఇది తనకు ఇష్టం ఉండదని ట్రంప్ అన్నారు. దాంతో అక్కడున్న వారంతా నవ్వులు చిందించారు. హత్యాయత్నం నేపథ్యంలో బుల్లెట్ ప్రూఫ్ ధరించడం లాంటి జాగ్రత్తలు తీసుకోవడం ముఖ్యమే అన్నారు. ఈ విషయం తనను చాలామంది అడిగారని, ఈ విషయం ఆలోచించవలసిందే వ్యాఖ్యానించారు. కానీ తనకు బుల్లెట్ ప్రూఫ్ జాకెట్ ధరించడం ఇష్టం ఉండదని చెప్పారు. అలా చేస్తే మనం ఒక చెడుశక్తికి లొంగిపోయినట్లు అవుతుందని అన్నారు. ఇదిలావుంటే.. మీపై మరోసారి దాడి జరుగుతుందేమోనన్న ఆందోళన మీకు ఉందా..? అని మరో మీడియా ప్రతినిధి ప్రశ్నించగా.. అలాంటి వాటి గురించి తాను ఆలోచించనని చెప్పారు. అలాంటి వాటి గురించి ఆలోచించుకుంటూ ఉంటే తాను తన పనిని సక్రమంగా చేసుకోలేనని అన్నారు.

# మొజ్తాబా ఖమేనీ సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నారు



**టెహ్రాన్ న్యూఢిల్లీ: మే 1 ( మహాప్రభ )**
అమెరికా దాడిలో ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ హతమయ్యారా? అసలు ఆయన బతికి ఉంటే.. బయట కనిపించడంలేదెందుకు? అని అమెరికా మీడియా పుకార్లను తెగ ప్రచారం చేస్తోంది. ఈ నేపథ్యంలో తాజాగా అమెరికా పుకార్లను ఇరాన్ సర్వోన్నత నాయకుడి కార్యాలయంలో అంతర్జాతీయ వ్యవహారాల ఉప మంత్రి, నిపుణుల సభ సభ్యుడు అయిన అయతొల్లా మొహ్సెన్ ఖోమీ తోసిపుచ్చారు. మొజ్తాబా ఖమేనీకి గాయాలైనప్పటికీ ఆరోగ్యంగా ఉన్నారని చెప్పినట్లు ఫార్స్ న్యూస్ ఏజెన్సీ నివేదించింది. కాగా, సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ గురించి.. 'అతను ఎందుకు హాజరు కావడం లేదు? అతను ఆడియో లేదా వీడియో సందేశం ఎందుకు పంపడం లేదు? అతన్ని సందర్శించిన వారు ముందుకు వచ్చి ఎందుకు మాట్లాడటం లేదు?'లాంటి ప్రశ్నలు వేసి తమ నుంచి విషయాల్ని రాబట్టడానికి శత్రువు వేసే ఒక ఎత్తుగడ అని అన్నారు. అమెరికా దాడిలో ఖమేనీకి గాయాయ్యాయి. ఇప్పుడు ఇరాన్ అధికారులు సర్వోన్నత నాయకుడి ప్రాణాలను కాపాడటంపై దృష్టి సారించారు. "ప్రస్తుతం భూమిపై దైవసాక్షిగా ఉన్న గౌరవనీయులైన నాయకుడి ప్రాణాలను కాపాడటమే మాకు అత్యంత ముఖ్యమైన విషయం. ఆయనకు గాయాలైనప్పటికీ, సర్వశక్తిమంతుడైన దేవుడు ఆయనను షియాలకు ఒక నిధిగా కాపాడాడని నేను మీకు హామీ ఇస్తున్నాను ఖోమీ అన్నారు. బాంబు దాడి జరిగిన భవనంలోనే మొజ్తాబా ఖమేనీ ఉన్నారు. అయితే చివరికి ఆయన ప్రాణాలతో బయటపడ్డారని ఖోమి ధృవీకరించారు. పేలుడు జరగడానికి కేవలం కొన్ని నిమిషాల ముందు, దైవ సంకల్పం వల్ల అతను ఆవరణలోకి వెళ్ళాడు. దేవుడు అతన్ని కాపాడాలని కోరుకున్నాడు అని ఆయన చెప్పారు. ప్రస్తుతం ఖమేనీ సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నారు. ఆయన వ్యవహారాలను చురుకుగా నిర్వహిస్తున్నారు. ఆయన తన ప్రత్యక్ష పర్యవేక్షణతో చర్చలు, క్షేత్రస్థాయి కార్యకలాపాలకు సంబంధించిన విషయాలను పర్యవేక్షిస్తున్నారు అని ఖోమీ అన్నారు.

# బెంగాల్, పుదుచ్చేరిల్లో అత్యధికంగా ఓట్లు వేసిన ట్రాన్స్‌జెండర్లు



**న్యూఢిల్లీ: మే 1 ( మహాప్రభ )**
తాజాగా ముగిసిన అసెంబ్లీ ఎన్నికల్లో ట్రాన్స్‌జెండర్లు భారీ సంఖ్యలో ఓట్లు వేశారు. ఎన్నికల సంఘం ఇవాళ ఆ నివేదికను విడుదల చేసింది. పశ్చిమ బెంగాల్‌లో ట్రాన్స్‌జెండర్లు అధిక సంఖ్యలో ఓటు వేశారు. బెంగాల్‌లో సుమారు 91.28 శాతం ట్రాన్స్‌జెండర్లు ఓట్లు వేసినట్లు ఈసీ చెప్పింది. ఆ రాష్ట్రంలో రెండు దశల్లో జరిగిన ఎన్నికల్లో 1257 మంది ట్రాన్స్‌జెండర్లు ఓటేశారు. తొలి దశలో 464, రెండో దశలో 792 మంది ట్రాన్స్‌జెండర్లు ఓటేశారు. తొలి దశలో ఓటింగ్ 56.79 శాతం, రెండో దశలో 91.28 శాతం మంది ట్రాన్స్‌జెండర్లు ఓటేశారు.అయితే పుదుచ్చేరిలో అత్యధిక సంఖ్యలో ట్రాన్స్‌జెండర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పుదుచ్చేరిలో 91.81 శాతం మంది ట్రాన్స్‌జెండర్లు అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు హక్కు వాడుకున్నారు. పుదుచ్చేరిలో మొత్తం 139 మంది ఉండగా, దాంట్లో 91.81 శాతం మంది ట్రాన్స్‌జెండర్లు ఓటు వేశారు. తమిళనాడులో 7728 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. దాంట్లో ఏప్రిల్ 23వ తేదిన జరిగిన ఎన్నికల్లో 60.49 శాతం మంది ఓటేశారు. ఇక అస్సాంలో 343 మంది ఓటర్లు ఉండగా, దాంట్లో 36.84 శాతం మంది ఓటేశారు. కేరళలో 277 మంది ట్రాన్స్‌జెండర్లు ఉండగా, 57.04 మంది ఓటేశారు.

# నేడు మీ ఫోన్‌కు అలర్ట్..

మొదటి తరువాయి




నిర్ధారించుకోవడానికి ఈ జాతీయ స్థాయి పరీక్షలను నిర్వహిస్తోంది.

**అమిత్ షా చేతుల మీదుగా ప్రారంభం..**

కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కేంద్ర సమాచార శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియాతో కలిసి ఈ మొబైల్ ఆధారిత విపత్తు కమ్యూనికేషన్ వ్యవస్థను అధికారికంగా ప్రారంభించనున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఎటువంటి నెట్వర్క్ జాప్యం లేకుండా వేగంగా హెచ్చరికలను పంపడం ఈ సిస్టమ్ ప్రత్యేకత. కాబట్టి, మీ ఫోన్‌కు ఇటువంటి 'టెస్ట్ అలర్ట్' వచ్చినప్పుడు అది కేవలం వ్యవస్థను మెరుగుపరచడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నమని గుర్తించండి.

### భగ్గుమన్న కమర్షియల్

# సిలిండర్ ధర



మొదటి తరువాయి

బేకరీలు వంటి వ్యాపారాలపై తీవ్ర ప్రభావం చూపనుంది. వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరను కేంద్ర ప్రభుత్వం ఒక్కసారిగా రూ.993 పెంచింది. ఈ పెంపుతో హైదరాబాద్‌లో కమర్షియల్ సిలిండర్ రేటు రూ.3,315కు చేరింది. ఢిల్లీలో 19 కిలోల సిలిండర్ ధర రూ.3,071కి చేరుకుంది. ఢిల్లీలో వాణిజ్య ఎల్‌పీజీ సిలిండర్ ధర గతంలో రూ. 2,078.50 ఉండేది. అదేవిధంగా, ముంబైలో వాణిజ్య ఎల్‌పీజీ సిలిండర్ ధర రూ.2,031 నుంచి రూ. 3,024కు పెరిగింది. ఇక 5 కిలోల సిలిండర్ ధర రూ.914.50కి పెరిగింది. ముఖ్యంగా పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ప్రారంభమైన ఫిబ్రవరి 28 నుంచి 19 కేజీల వాణిజ్య ఎల్పీజీ సిలిండర్ ధరలను మూడుసార్లు పెంచింది కేంద్రం. మొదట మార్చిలో రూ.144 పెరగగా, ఏప్రిల్ 1న దాదాపు రూ.200 మేర పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్లలో ముడి చమురు ధరలు పెరగడం, సరఫరా ఇబ్బందులు, పశ్చిమాసియా ప్రాంతంలో యుద్ధ పరిస్థితులు వంటి అంశాలు ఈ పెంపునకు ప్రధాన కారణాలుగా తెలుస్తోంది. వాణిజ్య సిలిండర్ ధరలు భారీగా పెరిగినా.. గృహ వినియోగానికి ఉపయోగించే ఎల్పీజీ సిలిండర్ ధరల్లో ఎలాంటి మార్పులు లేవని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. దీంతో సాధారణ ప్రజలకు కొంత ఊరట లభించింది. గృహ వినియోగ సిలిండర్ ధరలను స్థిరంగా ఉంచడం ద్వారా ప్రజలపై ఆర్థిక భారం పడకుండా కేంద్ర ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంటోంది. ఇదిలా ఉండగా.. పెట్రోల్, డీజిల్ రిటైల్ ధరలు కూడా యథాతథంగా ఉన్నాయి. మరోవైపు, విమానయాన రంగానికి పెద్ద ఊరటనిస్తూ దేశీయ విమానయాన సంస్థలకు ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ ధరల్లోనూ కేంద్రం ఎలాంటి మార్పులు చేయలేదు.

# తప్పుడు కథనాలు రాయొద్దు

మొదటి తరువాయి

కథనాలపై ఆమె న్యాయపోరాటం చేస్తూ.. చివరకు కోర్టు నుంచి మధ్యంతర ఉత్తర్వులను సాధించారు. హైదరాబాద్‌కు చెందిన ఎన్నారై ధర్మేంద్ర ఫిర్యాదుతో సీసీఎస్‌లో నమోదైన కేసు ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉంది. ఈ తరుణంలో తన పరువుకు భంగం కలిగించేలా, తన వ్యక్తిగత జీవితంపై నిరాధారమైన వార్తలను ప్రచారం చేయకుండా ఆదేశించాలని అషురెడ్డి కోర్టును ఆశ్రయించారు. కాగా, అషురెడ్డికి సంబంధించిన నిరాధారమైన విషయాలను ప్రసారం చేయకూడదని తెలంగాణ హైకోర్టు మీడియాను, కంటెంట్ క్రియేటర్లను ఆదేశించింది. ఆమె ప్రైవసీని గౌరవించాలని న్యాయస్థానం స్పష్టం చేసింది.

**ఇన్స్టాలో సుదీర్ఘ పోస్టు..**

కోర్టు ఉత్తర్వుల అనంతరం అషురెడ్డి ఇన్స్టాగ్రామ్‌లో ఒక సుదీర్ఘ పోస్ట్ పెట్టారు. తనపై వస్తున్న వార్తలన్నీ అవాస్తవాలని, నిరాధారమైనవని పేర్కొన్నారు. ఇప్పటికే ప్రసారమైన అభ్యంతరకర పోస్టులను తొలగించాలని విజ్ఞప్తి చేశారు. కోర్టు ఆదేశాలను ఉల్లంఘించి, ఇంకా తప్పుడు ప్రచారం చేసే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. తన ప్రైవసీకి భంగం కలిగించవద్దని మీడియాను, నెటిజన్లను కోరుతూనే, తనకు మద్దతుగా నిలిచిన వారికి ధన్యవాదాలు తెలిపారు.

# తుమ్మిడిహట్టికి... సీఎం రేవంత్

మొదటి తరువాయి

అధికార యంత్రాంగం కసరత్తు

ముఖ్యమంత్రి పర్యటన ఖరారు కావడంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. శుక్రవారం జిల్లా ఉన్నతాధికారులు తుమ్మిడిహట్టి ప్రాంతాన్ని సందర్శించి ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ హరిత, ఎస్పీ నితికా పంత్, అదనపు కలెక్టర్ డేవిడ్, సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్ల, ఎమ్మెల్సీ దండే విఠల్ పర్యవేక్షించారు. హెలిప్యాడ్ నిర్మాణం, భద్రతా చర్యలు, సీఎం పర్యటన రూట్ మ్యాప్, బ్యారేజీ నిర్మాణ నమూనాల ప్రదర్శనపై అధికారులు చర్చించారు.

తుమ్మిడిహట్టి ప్రాజెక్టు ప్రాధాన్యం

ఈ ప్రాజెక్టు పూర్తయితే ఆసిఫాబాద్ జిల్లాలోని కరువు ప్రాంతాలకు సాగునీరు అందుతుంది. మహారాష్ట్ర సరిహద్దులో ఉండే ఈ ప్రాజెక్టు ఎత్తు విషయంలో గతంలో అనేక చర్చలు జరిగాయి. ఇప్పుడు 150 మీటర్ల ఎత్తులో నిర్మాణానికి అడుగులు పడుతుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ ప్రాజెక్టు నిర్మాణం వల్ల స్థానిక ఉపాధి అవకాశాలు మెరుగుపడే అవకాశం ఉంది. ముఖ్యమంత్రి పర్యటనతో తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణ పనుల్లో వేగం పెరుగుతుందని జిల్లా రైతాంగం ఆశాభావం వ్యక్తం చేస్తోంది. పర్యటనకు సంబంధించిన తుది షెడ్యూల్ మరికొద్ది రోజుల్లో అధికారికంగా విడుదల కానుంది.

# జూన్2 నాటికి జర్నలిస్ట్‌ల ఇళ్ల స్థలాల సమస్యకు పరిష్కారం

మొదటి తరువాయి

అందులో సభ్యుల సంఖ్య, సభ్యత్వానికి అర్హతలు, ఇతర అన్ని అంశాలపై మంత్రిగారు సొసైటీ సభ్యులు అడిగి తెలుసు కున్నారు. జవహర్‌లాల్ నెహ్రూ హౌసింగ్ సొసైటీ మినహా మిగిలిన మూడు సొసైటీలలో సుమారు 2,424 మంది అర్హులైన జర్నలిస్టులు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జర్నలిస్టులు అందరూ ఒకేతాటిపై ఉంటే సమస్యల పరిష్కారం సులువు అవుతుందని, అన్ని సొసైటీలు కలిపి ఒకే వేదికపైకి వచ్చి జేఏసీ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. జర్నలిస్టు సంఘాలలో సభ్యులు కాని అర్హులైన జర్నలిస్టులకు కూడా ఇళ్ళ స్థలాలు ఇస్తామని చెబుతూ ఎలాంటి విమర్శలకు, అనుమానాల కు తావు లేకుండా ఇళ్ల స్థలాల మంజూరు జరిగేలా అందరూ సహకరించాలని కోరారు. గతంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వాలదేనని, ఇప్పుడు కూడా ప్రజా ప్రభుత్వం వచ్చాక 18 ఏళ్లుగా పరిష్కారం కాని జవహర్ లాల్ నెహ్రూ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ ఇళ్ల సమస్యను కొలిక్కి తీసుకువచ్చి రవీంద్ర భారతిలో జర్నలిస్టుల కుటుంబాలతో సమావేశాన్ని ఏర్పాటు చేసి భూమి అప్పగించినప్పటికీ న్యాయవివాదాల కారణంగా



సమస్య మళ్లీ మొదటికి వచ్చిందని గుర్తు చేశారు. జర్నలిస్ట్ ల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని దశాబ్దాల కాలంగా పెండింగ్‌లో ఉన్న ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకొని జూన్ 2వ తేదీ నాటికి కొలిక్కి తీసుకువస్తామని తెలిపారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూల దృక్పథంతో ఉన్నారని ఫ్యూచర్ సిటీలో ఎమ్మెల్యేలు, బ్యూరో క్రాట్స్ తో పాటే హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న జర్నలిస్టులకు కూడా ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి సిద్దంగా ఉన్నారని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి జవహర్ లాల్ నెహ్రూ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ ప్రతినిధులతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వారికి సూచన ప్రాయంగా వెల్లడించి సొసైటీలో ఒక తీర్మానం చేసి ప్రభుత్వానికి అందజేయాలని సూచించారు. 18 సంవత్సరాల క్రితమే ఇంటి స్థలాల కోసం ప్రతిసభ్యుడు రెండు లక్షల రూపాయిల చొప్పున చెల్లించారని దీనిని దృష్టిలో పెట్టుకొని ఇళ్ల స్థలాల కేటాయింపులో తమ సొసైటీకి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని ఈ సందర్భంగా సభ్యులు మంత్రిని కోరారు. సమావేశంలో మీడియా అకాడమీ ఛైర్మన్ కె. శ్రీనివాసరెడ్డి, సమాచార పౌరసంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ జి. ముకుంద రెడ్డి, సీపీఆర్వో మల్సూర్ తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీ క్యాపిటల్స్ ధమాకా..

మొదటి తరువాయి

నేనున్నానంటూ ముందుకొచ్చాడు. ఈ సీజన్‌లో తొలిసారి అతడి బ్యాట్ నుంచి పరుగులు వచ్చాయి. మొత్తంగా ఈ ఇన్నింగ్స్‌లో అతడు 50 బంతుల్లో 90 రన్స్ చేశాడు. చివర్లో డోనోవాన్ ఫెర్రీరా 14 బంతుల్లో 47 రన్స్ చేసి అజేయంగా నిలిచి జట్టుకు మెరుగైన స్కోరు అందించాడు. ఫెర్రీరా ఈ ఇన్నింగ్స్‌లో 6 సిక్సులు, 2 ఫోర్లు కొట్టాడు. అనంతరం 226 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఓపెనర్లు కేఎల్ రాహుల్ (40 బంతుల్లో 75 రన్స్), పథుమ్ నిస్సాంక (33 బంతుల్లో 62 రన్స్) శుభారంభం అందించారు. వీరిద్దరూ తొలి వికెట్‌కు 57 బంతుల్లో 110 రన్స్ జోడించి.. గట్టి పునాది వేశారు. చివర్లో వీరిద్దరూ ఔట్ అయినా.. నితీశ్ రాణా (17 బంతుల్లో 33 రన్స్), అశుతోష్ శర్మ (15 బంతుల్లో 25 రన్స్) మ్యాచ్ ముగించారు. దీంతో 19.1 ఓవర్లలో ఢిల్లీ క్యాపిటల్స్ మూడు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఈ విజయంతో ఢిల్లీ క్యాపిటల్స్ ఊపిరి పీల్చుకుంది. ఎందుకంటే ఆ జట్టు వరుసగా మూడు ఓటముల తర్వాత ఈ విజయం సాధించింది. దీంతో ప్లే ఆఫ్స్ అవకాశాలను మెరుగుపర్చుకుంది. ఢిల్లీ క్యాపిటల్స్ ఆడిన 9 మ్యాచులలో 4 విజయాలు, ఐదు ఓటములతో ఆరో ప్లేసులో ఉంది. మరోవైపు ఈ టోర్నీలో నాలుగో ఓటమి నమోదు చేసిన రాజస్థాన్ రాయల్స్.. 10 లీగ్ మ్యాచులు ముగిశాక నాలుగో ప్లేసులో ఉంది. లీగ్ స్టేజ్ ముగిసే సరికి పాయింట్స్ టేబుల్‌లో తొలి నాలుగు స్థానాల్లో ఉన్న జట్లు ప్లే ఆఫ్స్ చేరతాయి.

# భారత్‌పై భారీ ఉగ్రదాడికి పాక్ కుట్ర!

మొదటి తరువాయి

రాజకీయ ఆకాంక్షలు ఉన్నాయని అధికారులు విశ్లేషిస్తున్నారు. దేశీయంగా తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటున్న అసిమ్ మునీర్, తన ప్రతిష్టను పెంచుకోవడానికి భారత్‌పై ఒక పెద్ద దాడిని ఉపయోగించుకోవాలని చూస్తున్నట్టు తెలుస్తోంది. అమెరికా-ఇరాన్ మధ్య శాంతి చర్చల్లో మధ్యవర్తిగా నిలిచి అంతర్జాతీయంగా గుర్తింపు పొందాలన్న ఆయన ప్రయత్నాలు విఫలమయ్యాయి. దీంతో ఆయన దృష్టి మళ్ళీ భారత్‌పైకి మళ్లింది. కశ్మీర్ అంశాన్ని రగిలించడం ద్వారా పాకిస్థాన్‌లో తన ఇమేజ్‌ను పెంచుకుని, భవిష్యత్తులో అధ్యక్ష పీఠాన్ని అధిరోహించాలనేది ఆయన దీర్ఘకాలిక ప్రణాళిక అని ఓ అధికారి తెలిపారు. ఇందుకోసం మునీర్ రెండంచెల వ్యూహంతో ముందుకు వెళుతున్నారు. మొదటి దశలో, కశ్మీర్‌లోని స్థానిక యువతను ఉగ్రవాదం వైపు



ప్రోత్సహించి, చిన్నచిన్న దాడులు చేయించడం ద్వారా లోయలో అశాంతిని సృష్టించడం. దీనివల్ల పర్యాటక రంగం దెబ్బతినడంతో పాటు సరిహద్దుల్లో మోహరించిన భారత భద్రతా బలగాల దృష్టిని అంతర్గత భద్రత వైపు మళ్లించవచ్చు. రెండో దశలో, ఈ అదను చూసి సరిహద్దుల్లోని లాంచ్ ప్యాడ్‌లలో సిద్ధంగా ఉన్న పెద్ద సంఖ్యలోని పాక్ ఉగ్రవాదులను భారత్‌లోకి పంపించి, ఒక భారీ దాడికి పాల్పడటం వారి వ్యూహంలో భాగం. ఆర్టికల్ 370 రద్దు తర్వాత కశ్మీర్ అంశాన్ని అంతర్జాతీయం చేయడానికి పాక్ చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. అది తమ అంతర్గత వ్యవహారమని భారత్ గట్టిగా స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో భారత్ చేత సైనిక చర్యకు ఆస్కారం కల్పించి, దానిని సాకుగా చూపి అంతర్జాతీయ సమాజం జోక్యం చేసుకునేలా చేయాలన్నదే మునీర్ అసలు లక్ష్యమని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలో పాకిస్థాన్‌లోని ఉగ్రవాద శిబిరాలపై భారత్ దాడి చేసినా పర్వాలేదన్న తెగింపుతో మునీర్ ఉన్నారని, ఆయనకు కశ్మీర్ అంశాన్ని అంతర్జాతీయం చేయడమే ముఖ్యమని విశ్లేషకులు చెబుతున్నారు.

# రాష్ట్రంలో కార్మిక వ్యతిరేక ప్రభుత్వం

మొదటి తరువాయి

చేసుకున్నారు. దీనిపై ప్రభుత్వం స్పందించడం లేదు. రెండేళ్లు భరించండి.. కేసీఆర్ వచ్చి కార్మికులకు మేలు చేస్తారని కేటీఆర్ అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కార్మికులకు చేతినిండా పని కల్పించి ఆదుకున్నదని, నగరంలో రోడ్లు, వంతెనల నిర్మాణం చేపట్టామని వెల్లడించారు. కోవిడ్ సమయంలో ఇతర రాష్ట్రాలకు వెళ్లేందుకు కార్మికులకు ఉచిత రైళ్లను కేసీఆర్ ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. కాంగ్రెస్ హయాంలో అవినీతి వల్ల, అసమర్థత వల్ల ఎస్ఎల్‌బీసీ కుప్పకూలిపోయి చనిపోయిన కార్మికులను అప్పగించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందని ఆరోపించారు. సంగారెడ్డి జిల్లా సిగాచీ పరిశ్రమలో అగ్నిప్రమాదం జరిగి 60 మంది సజీవదహనం అయితే పట్టించుకున్న నాథులే లేరని దుయ్యబట్టారు. కోటి రూపాయల నష్ట పరిహారం ఇస్తామని రేవంత్ హామీ ఇచ్చి ఇప్పటి వరకు ఇవ్వలేదని విమర్శించారు. నగరంలో వలసవచ్చి నివాసమేర్పచుకున్న కార్మికుల ఇళ్లను హైడ్రా పేరిట కూల్చి రోడ్డుపాలు చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలనలో



కూల్చివేతలు, ఎగవేతలు, పేల్చివేతలు మాత్రమే జరుగుతున్నవని తెలిపారు. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు, ఎన్నికలకు ముందు దాన,వీర, శూర కర్ణ. ఎన్నికల తరువాత కుంబకర్ణ పాత్రను పోషిస్తున్నాడని దుయ్యబట్టారు. కొవిడ్ సమయంలో అందరూ ఇళ్లలో ఉంటే.. తాము రోడ్లు, వంతెనలు పూర్తి చేశామన్నారు. ' తెలంగాణ అంటే ప్రేమ ఉంది కాబట్టే.. లాక్‌డౌన్‌లో రోడ్లు, వంతెనలు నిర్మించాం. లాక్‌డౌన్ సమయంలో రాష్ట్రంలోని కార్మికులు స్వస్థలాలకు బయల్దేరారు. అభివృద్ధి కార్యక్రమాలు ఆగకూడదనే ఉద్దేశంతో లేబర్ క్యాంపులకు వెళ్లి కార్మికులకు దండం పెట్టి.. రోడ్లు నిర్మించాం అన్నారు. దేశ చరిత్రలో ఎన్నడు పెంచనంతగా వాణిజ్య సిలిండర్ల మీద రూ.993 పెంచిన ఘనత కేంద్రంలోని నరేంద్ర మోదీ దేనని కేటీఆర్ విమర్శించారు. ఎన్నికలు అయిపోగానే గ్యాస్ సిలిండర్ల ధరలు పెంచడం మోదీకి అలవాటేనని అన్నారు. ఒక్క సిలిండర్ మీద దాదాపు రూ.1000 పెంచి సామాన్యులకు, హోటళ్లలో పని చేసే కార్మికులకు మోదీ మేడే కానుక ఇచ్చాడని దుయ్యబట్టారు. హైదరాబాద్‌లో నిన్నటి వరకు ఒక సిలిండర్ ధర రూ. 2,321 ల నుంచి రూ.3,315 పెంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హోటళ్లు, మెస్‌ల మీద ఆధారపడి చదువుకునే యువతకు, ఉద్యోగాలు చేసుకునే వారికి ఈ ధరల పెంపు వల్ల ఇబ్బందులు ఎదురవుతాయని పేర్కొన్నారు. తక్షణమే పెంచి ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు.

## ఇరాన్‌పై మళ్లీ భీకర దాడులు.. సిద్ధమవుతున్న అమెరికా

**-24 గంటల్లోనే ఇజ్రాయెల్‌కు 6,500 టన్నుల ఆయుధ సామగ్రి**

**-ఇరాన్‌ను చర్చలకు రప్పించడమే లక్ష్యం**

**వాషింగ్టన్**

ఇరాన్‌పై మళ్లీ భీకర దాడులకు అమెరికా సిద్ధమవుతున్నదా? 24 గంటల్లో ఇజ్రాయెల్‌కు అమెరికా 6,500 టన్నుల ఆయుధ సామగ్రి తరలించడంతో ఇదే అనుమానం వ్యక్తమవుతున్నది. రెండు కార్గో నౌకలు, పలు విమానాల్లో ఈ సామగ్రి చేరుకుంది. భూతల, గగనతల దాడులకు వినియోగించే ఆయుధాలు, మందుగుండు సామగ్రి, మిలిటరీ ట్రక్కులు, జాయింట్ లైట్ టాక్టికల్ వాహనాలు ఇందులో ఉన్నట్టు ఇజ్రాయెల్ రక్షణ శాఖను ఉటంకిస్తూ ఇజ్రాయెల్ టైమ్స్, ద జెరూసలేం పోస్ట్ వెల్లడించాయి. ఇరాన్‌తో యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఇజ్రాయెల్‌కు అమెరికా 1,15,600 టన్నుల మిలిటరీ సామగ్రిని అందజేసింది. ఇరాన్‌ను చర్చలకు రప్పించడమే లక్ష్యంగా అమెరికా తాజా దాడులకు సిద్ధమవుతున్నట్టు తెలుస్తున్నది.

# ధరలపై తాము ముందే చెప్పాం

మొదటి తరువాయి

ధరలు పెరుగుతాయని రాహుల్ గాంధీ మంగళవారం పేర్కొన్నారు. 'అలర్ట్‌గా ఉండండి.. ఎన్నికల వల్ల కలిగిన ఉపశమనం ఇక ముగిసినట్టే. ఇంధన ధరలు తక్కువగా ఉన్నప్పుడు మోదీ ప్రభుత్వం లాభాలను దండుకుంది. ఇప్పుడు ధరలు పెరిగాయి కాబట్టి ధరాభారాన్ని ప్రజలపై పెడుతుంది' అని రాహుల్ అప్పట్లో విమర్శించారు

# కవిత భయంతో మేల్కొన్న కేసీఆర్

మొదటి తరువాయి

హైడ్రా గురించి కేసీఆర్ చదువుకుంటే మంచిదని హితవుపలికారు. కబ్జాల నుంచి విముక్తి కల్పిస్తే కేసీఆర్‌కు వచ్చిన ఇబ్బంది ఏంటి అని ప్రశ్నించారు. హైడ్రా వల్ల బీఆర్ఎస్ నాయకులకు ఇబ్బంది కలుగుతోందన్నారు. సిటీ చుట్టూ ఉన్న చెరువులను ఆ పార్టీ నేతలే కబ్జా చేశారని ఆరోపించారు. గులాబీ పార్టీ నేతలు ఎందుకు సభలు పెడుతున్నారని పీసీసీ చీఫ్ నిలదీశారు. తాము చేసిన డిక్లరేషన్లు అమలు చేస్తున్నామని.. త్వరలోనే పదవుల భర్తీ ఉంటుందని స్పష్టం చేశారు. నాలుగు రోజుల క్రితం పదవుల భర్తీపై చర్చించినట్లు తెలిపారు. మంత్రివర్గ విస్తరణపై సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకుంటారని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

# సంపాదకీయం

## ఉక్రోషదాడుల ఉత్తరువు!



అమెరికా,ఇజ్రాయిల్ ప్రారంభించిన ఏకపక్ష దాడులు, దానికి ఇరాన్ ప్రతిఘటనకు రెండు నెలలు గడచిపోయాయి. ఏప్రిల్ ఏడు నుంచి తాత్కాలిక కాల్పుల విరమణ అమల్లోకి వచ్చింది.తొలుత హోర్ముజ్ జలసంధిని ఇరాన్ ఒక్కటే దిగ్బంధిస్తే తరువాత అమెరికా మరోవైపునుంచి నౌకలను మళ్లేస్తున్నది.ఈ పరిస్థితిలో ఎప్పుడు మార్పు వస్తుందో తెలియదు. అమెరికా రాజ్యాంగం ప్రకారం అరవై రోజులకు మించి అధ్యక్షుడి ఉత్తరువులతో ఏదేశం మీద కూడా సైనిక చర్య జరిపేందుకు వీల్లేదు. దీంతో చట్టంలో ఉన్న అవకాశాన్ని వినియోగించుకొని మరో నెల రోజుల పాటు ఇరాన్ మీద దాడులను పొడిగిస్తూ ఏప్రిల్30న ట్రంప్ ఉత్తరువులు జారీ చేశాడు.కాల్పుల విరమణ వ్యవధిలో మరిన్ని బలగాలను సమీకరించేందుకు వినియోగించుకుంటున్నట్లు ఇరాన్ చెబుతున్న సంగతి తెలిసిందే. ఇరాన్ మీద మరోసారి దాడులకు తెగబడితే తీవ్రమైన హానికర పర్యవసానాలు ఉంటాయని, ఇది ఏమాత్రం సమర్ధనీయం కాదని రష్యా అధ్యక్షుడు పుతిన్ అమెరికాను హెచ్చరిం చాడు. ట్రంప్‌తో గంటన్నర పాటు ఫోన్‌లో మాట్లాడిన అనేక అంశాల్లో ఇదో హెచ్చరిక. భూతల దాడులకు దిగాలని చేస్తున్న ప్రయత్నాల గురించి తమనేత ట్రంప్‌ను హెచ్చరించినట్లు పుతిన్ విదేశాంగవిధాన సలహాదారు చెప్పాడు. పుతిన్‌తో సంభాషణ తరువాత తాము మంచిగా మాట్లాడుకున్నామని, తనకు పుతిన్ ఎప్పటి నుంచో తెలుసని ట్రంప్ చెప్పుకున్నాడు. ఇరాన్ యురేనియంను అవసరమైతే తమ ఆధీనంలో ఉంచుకుంటామని పుతిన్ చెప్పగా ఉక్రెయిన్‌లో పోరును ముగించాలని కోరుకుంటున్నట్లు ట్రంప్ చెప్పాడట. మరింతగా ఊబిలోకి దిగవద్దంటూ జర్మన్ ఛాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్ చేసిన స్నేహపూర్వక హెచ్చరిక మీద మండిపడిన ట్రంప్ మరోసారి తన అసహనం, దురుసుతనాన్ని ప్రదర్శించాడు. బీటలు వారిన మీదేశం సంగతి ముందు చూసుకోండి,ఇరాన్ అణుముప్పును తొలగించేందుకు చూస్తున్నవారి వ్యవహారాల్లో జోక్యం చేసుకోవద్దంటూ వ్యాఖ్యానించాడు. అంతేకాదు ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధాన్ని నివారించటంలో జర్మనీ పూర్తి అసమర్ధంగా వ్యవహరించిందంటూ ఎదురుదాడి చేశాడు.తమకు మద్దతుగా దాడుల్లో పాల్గొనాలన్న ట్రంప్ వినతిని తమ యుద్ధం కాదంటూ నాటో దేశాలు తిరస్కరించిన సంగతి తెలిసిందే. పిర్రగిల్లి జోలపాడినట్లుగా ఇరాన్ దౌత్యపరంగా ఎంతో తెలివిగా వ్యవహ రించిందని, అమెరి కాను అవమానిం చిందని జర్మన్ ఛాన్సలర్ మెర్జ్ వాషింగ్టన్ గాలి తీశాడు.అఫ్ కోర్స్ ట్రంప్ వదరుబోతు తనంతో పోల్చితే ఇది చాలా తక్కువే. మామ తిట్టినందుకు కాదు తోడల్లుడు నవ్వినందుకు అన్నట్లుగా ఇరాన్ చేతిలో పొందుతున్న పరాభవానికి సిగ్గుపడాల్సిన ట్రంప్ స్నేహపూర్వక సలహా మీద మండిపడటం అనుచితం. పశ్చిమాసియాలో అమెరికా సృష్టించిన సంక్షోభం ప్రారంభమై రెండు నెలలు దాటింది. ఇరాన్ మీద తాము సైనిక చర్యను ప్రారంభించామే తప్ప దాన్ని యుద్ధంగా తాను పిలవటం లేదని ఏప్రిల్ ఒకటవ తేదీన చేసిన ప్రసంగంలో ట్రంప్ యావత్ అమెరికాను వెర్రి వెంగళప్పలను చేశాడు. ఎందుకంటే అమెరికా రాజ్యాంగం ప్రకారం మరొక దేశం మీద యుద్ధం చేయాలంటే అక్కడి పార్లమెంటు ఆమోదం అవసరం.దానితో నిమిత్తం లేకుండానే ట్రంప్ గతేడాది, ఇప్పుడు కూడా దాడులకు ఆదేశించాడు.రాజ్యాంగం, ప్రజాస్వామ్యాన్ని ఎంత పరిహాస ప్రాయంగా మార్చోరో ఇంతకంటే నిదర్శనం అవసరం లేదు.అధ్యక్షుడి మిలిటరీ చర్య ఉత్తరువుల వ్యవధి అరవై రోజుల్లో ముగుస్తుంది. తరువాత దాడులను నిలిపివేయాల్సి ఉంటుంది. అయితే మరో నెల రోజుల పాటు పొడిగించేందుకు రాజ్యాంగంలో వీలు వుండటంతో ఆ మేరకు మరో 30రోజులు దాడులను పొడిగించేందుకు ఏప్రిల్ 30న ఉత్తరువుల మీద సంతకం చేస్తూ మరోసారి అదే చెప్పాడు.దీన్ని బట్టి ఇరాన్ మీద మరోసారి తెగబడేందుకు అవకాశం ఉంది. ఈ నేపథ్యంలోనే పుతిన్ గట్టి హెచ్చరిక చేసినట్లు భావించాల్సి వస్తోంది. ఇరాన్‌పై వాషింగ్టన్ చెలగాటం మనతో సహా అనేక దేశాలకు ప్రాణ సంకటంగా మారింది. మే ఒకటవ తేదీ నుంచి వాణిజ్య గ్యాస్ సిలిండర్ల ధరను చమురు సంస్థలు రూ.2,078 నుంచి రూ.3071కి పెంచాయి. ముందుగా ఊహించినట్లుగా ఇది ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగిసిన తరువాత ఈ బండను మోపారు. దేశ చరిత్రలో ఇదొక రికార్డు, దీన్ని నరేంద్రమోడీకే అంకితం ఇవ్వాలి.పెంచింది వాణిజ్య సిలిండర్ ధరేగా అని ఎవరైనా అతితెలివి ప్రదర్శించవచ్చు. గృహం, వాణిజ్య సిలిండర్ పేరు ఏదైతేనేం, భారాన్ని భరించేది జనమే. ధరల పెంపుదల లేదు అంటూ రోజూ ఊదరగొడుతున్నవారు ఇప్పటికే పవర్ పెట్రోలు, పారిశ్రామిక అవసరాల డీజిల్,గృహ, వాణిజ్య వినియోగగ్యాస్ ధరలను పెంచారు.నష్టాలు వస్తున్న మార్కెటింగ్ కంపెనీలను ఆదుకొనేందుకు పన్నెండు సంవత్సరాలుగా జనం జేబులను కొల్లగొడుతున్నది. అదనపు ఎక్సయిజ్ డ్యూటీని కేంద్రం తగ్గించుకుంది, దీంతో వినియోగదారులకు ఒరిగేదేమీ లేదు.ఈ మొత్తంలో రాష్ట్రాలకు వాటా లేదు గనుక మౌనంగా ఉన్నాయి.ఇప్పటికీ సెస్‌ల రూపంలో రాష్ట్రాలకు వాటా ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం లీటరు పెట్రోలుకు రూ.7.50, డీజిలు మీద రూ.6, అదనంగా కస్టమ్స్,మొత్తం డ్యూటీల మీద పదిశాతం చొప్పున సంక్షేమ సర్‌ఛార్జీ వసూలు చేసుకుంటున్నది. జన సంక్షేమానికి జనం నుంచే వసూలు చేస్తూ తామేదో ఒరగబెడుతున్నట్లు ఫోజు అదనం !

## పోతంశేట్ పల్లిలో బుద్ధ పౌర్ణమి సందర్భంగా అఖండ ధ్యాన కార్యక్రమం



**మెదక్ జిల్లా -01మే (మహాప్రభ )**
మెదక్ జిల్లా,కొల్చారం మండల పరిధిలోని పోతన్ శెట్టిపల్లి గ్రామంలో పంచాక్షరి మహా శక్తి పిరమిడ్ కేంద్రంలో శుక్రవారం రోజు ఉదయం 6 గంటల నుండి శనివారం వరకు 24 గం.పాటు ధ్యాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు.బుద్ధ పౌర్ణమి పురస్కరించుకొని పిరమిడ్ సొసైటీ వారి ఆధ్వర్యంలో శుక్రవారం పంచాక్షరి పిరమిడ్ మాస్టర్ అనసూయమ్మ మాట్లాడుతూ సర్వ మానవులలో ఒకే ఆత్మ ఉందని గౌతమ్ బుద్ధుడు చెప్పారని,ఈ సందర్భంగా గుర్తు చేశారు. బ్రహ్మశ్రీ పితామగురువు పత్రీజీ ఆశయ సాధనలో శ్వాస మీద ధ్యాస పెడితే ప్రతి ఒక్కరికి జీవిత సత్యాలు అర్థమవుతాయని ఆమె అన్నారు.బుద్ధం శరణం గచ్చామి అంటూ అందరికీ బుద్ధుని గురించి వివరించారు.

గౌతమ బుద్ధుని అమృత వాక్కులు

**విజయం మీ సొంతం కావాలంటే..**

జీవితంలో విజయం సాధించడం అంటే వేల యుద్ధాలు గెలవడం కాదు, తనను తాను జయించడం. తన మనస్సును,ఆలోచనలను నియంత్రించుకోగలిగిన వ్యక్తికి లభించే విజయాన్ని ఎవరూ లాక్కోలేరు.అలాగే ఒక లక్ష్యాన్ని చేరుకోవడం కంటే ఆ లక్ష్యం వైపు మనం సాగించే ప్రయాణం ఎంత పవిత్రంగా ఉందనేది ముఖ్యం. అహింస, యజ్ఞాలు ప్రాచీన కాలంలో కోరికలు, ఆకలి, వృద్ధాప్యం మాత్రమే మానవుడికి కష్టాలుగా ఉండేవని, కానీ పశుపక్ష్యదుల... హింస పెరిగే కొద్దీ వ్యాధులు, కష్టాలు అసంఖ్యాకమయ్యాయని, బుద్ధుడు ఆవేదన వ్యక్తం చేశారు.యజ్ఞాల పేరుతో అమాయక జంతువులను బలి ఇవ్వడం అధర్మమని, ఇది నిందనీయమైన చర్య అని ఆయన ఖండించారు.జంతు బలి ద్వారా ధర్మం నశిస్తుందని,అహింస ద్వారానే అసలైన ధర్మం నిలబడుతుందని అనసూయమ్మ బుద్ధుని గురించి అర్థమయ్యే విధంగా బోధించారు.ఈ కార్యక్రమంలో సురేందర్ పట్లోళ్ల రామకృష్ణ,నాగరాజు,సంగాయిపేట్ వీరేశం,ఆలూరి అనిత,జోగిపేట చెందిన సత్యమ్మ,పొడిచిన పల్లి సంతోష లక్ష్మి చౌటకు పిరమిడ్ మాస్టర్ అనసూయ పుష్ప తదితరులు అఖండ ధ్యానంలో పాల్గొన్నారు.

## పౌర్ణమి వేళ .. అరణ్యంలో అధ్యాత్మిక





**పాపన్నపేట మే 1( మహా ప్రభ)**
భక్తుల జయ జయ ద్వానాలతో అరణ్యంలో ఆధ్యాత్మికత సంతరించుకుంది. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మెదక్ జిల్లా ఏడుపాయల వనదుర్గమ్మ ఆలయం. శుక్రవారం పౌర్ణమి ని పురస్కరించుకొని వనదుర్గా క్షేత్రంలో వైభవంగా పల్లకీ సేవా నిర్వహించారు. అర్చకులు శంకర్ శర్మ,పార్థివ శర్మ మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజగోపురం,శివాలయం ముందుగా ఈ ఊరేగింపు కనుల పండువగా సాగింది.

## జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మేడే ఉత్సవాలు

-సామాజికవేత్త శ్రీనివాస్ గౌడ్





**దేవరకొండ మే 1 ( మహాప్రభ )**
ప్రపంచ కార్మికులందరికీ మేడే శు భాకాంక్షలుతెలిపిన సామాజికవేత్త బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్.
దేవరకొండ పట్టణంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మేడే దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి . కొంతమంది వివిధ విభాగాలలో పనిచేసేటువంటి కార్మికులకు మేడే సందర్భంగా శాలువా,మెమొంటోతో సన్మాన కార్యక్రమం నిర్వహించారు సందర్భంగా సామాజికవేత్త బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ప్రపంచ కార్మికులారా ఐక్యం కాండి, మీ హక్కుల కోసం మీరు పోరాటం చేయండి, పోరాడితే పోయేదేమీ లేదు, బానిస సంకెళ్లు తప్ప అనే నినాదంతో ముందుకొచ్చి హక్కుల కోసం ఐక్యమై సాధించండి. ప్రపంచంలో ఉన్నటువంటి కార్మికులందరికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్డి కోటేశ్వరరావు,వరికుప్పల శీను, ఎం.డి రంజాన్ బేగ్, అప్పం వీరయ్య, జయరాం, ఇరగదేండ్ల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక కర్షక లోకానికి మే డే శుభాకాంక్షలు

నల్గొండ జిల్లా బి.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్



**దేవరకొండ మే 1 ( మహాప్రభ )**
ఉత్పత్తి రంగంలో భాగమై దేశ సంపదను సృష్టిస్తున్న కార్మికుల రెక్కల కష్టం, వారి త్యాగాలు అమూల్యమైనవని మాజీ ఎమ్మెల్యే నల్గొండ జిల్లా బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు రమావత్ రవీంద్ర కుమార్ కొనియాడారు. చారిత్రాత్మక మే డే స్ఫూర్తితో బీఆర్ఎస్ ప్రభుత్వం, సబ్బండ కులాల కర్షక కార్మికుల సంక్షేమం కోసం అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను, ఆదర్శవంతమైన పారిశ్రామిక విధానాలను అమలు చేసిందని అన్నారు. సింగరేణి, ఆర్టీసీ, భవన నిర్మాణ రంగం సహా పలు రంగాలకు చెందిన కార్మికులు, ఆటో డ్రైవర్లు, దినసరి కూలీలు, అసంఘటిత రంగ కార్మికుల కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వినూత్న పారిశ్రామిక విధానాల ద్వారా తెలంగాణలో సంపద సృష్టించడంతో లక్షలాది మందికి ఉపాధి అవకాశాలు లభించాయని ఈ సందర్భంగా ఆయనపేర్కొన్నారు. నాటి పదేండ్ల ప్రగతి కార్యాచరణను మరింత పటిష్టంగా అమలు చేయడమే రాష్ట్ర కార్మిక లోకానికి మనమిచ్చే గొప్ప కానుక అని స్పష్టం చేశారు.

## జగన్ డాన్స్ స్టూడియో వేసవి శిక్షణా శిబిరం






**దేవరకొండ డివిజన్ మే 01 ( మహాప్రభ )**
విద్యార్థులు చదువుతో పాటు లలిత కళల పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలని , సీ ఐ వెంకట్ రెడ్డిపేర్కొన్నారు. స్థానిక జగన్ డ్యాన్స్ స్టూడియోలో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంప్‌ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై, రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం స్టూడియోలో ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సెలవుల్లో పిల్లలు సెల్ ఫోన్లకు పరిమితం కాకుండా, ఇలాంటి శిక్షణా శిబిరాల ద్వారా తమలోని ప్రతిభకు పదును పెట్టుకోవాలని సూచించారు. డ్యాన్స్, వంటి అంశాలు శారీరక దృఢత్వానికి, మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదపడతాయని అన్నారు. స్టూడియోలో వెస్ట్రన్, ఫోక్, జుంబా, దండియా వంటి విభాగాల్లో శిక్షణ ఇవ్వడం అభినందనీయమని అన్నారు.
**పాల్గొన్న అతిథులు:** ఈ కార్యక్రమంలో ఎస్సై నర్సింహులు, ఆర్.కె. సేవా ఫౌండేషన్ అధ్యక్షులు పున్నా రామకృష్ణ, జర్నలిస్ట్ ముషీని అంజి, కరాటే మాస్టర్ శ్రీను, కౌన్సిలర్ సాయి, డ్యాన్స్ మాస్టర్ క్రాంతి, గుండాల వెంకట్ యాదవ్ తో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.
**దేవరకొండ:** విద్యార్థులు చదువుతో పాటు లలిత కళల పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలని, సీ ఐ వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక జగన్ డ్యాన్స్ స్టూడియోలో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంప్‌ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై, రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం స్టూడియోలో ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సెలవుల్లో పిల్లలు సెల్ ఫోన్లకు పరిమితం కాకుండా, ఇలాంటి శిక్షణా శిబిరాల ద్వారా తమలోని ప్రతిభకు పదును పెట్టుకోవాలని సూచించారు. డ్యాన్స్, వంటి అంశాలు శారీరక దృఢత్వానికి, మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదపడతాయని అన్నారు. స్టూడియోలో వెస్ట్రన్, ఫోక్, జుంబా, దండియా వంటి విభాగాల్లో శిక్షణ ఇవ్వడం అభినందనీయమని అన్నారు
**పాల్గొన్న అతిథులు:** ఈ కార్యక్రమంలో ఎస్సై నర్సింహులు, ఆర్.కె. సేవా ఫౌండేషన్ అధ్యక్షులు పున్నా రామకృష్ణ, జర్నలిస్ట్ ముషీని అంజి, కరాటే మాస్టర్ శ్రీను, కౌన్సిలర్ సాయి, డ్యాన్స్ మాస్టర్ క్రాంతి, గుండాల వెంకట్ యాదవ్ తో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మాజీ డిప్యూటీ స్పీకర్ యం. పద్మ దేవేందర్ రెడ్డికి కళ్యాణ శుభలేఖ అందజేత.



**మెదక్ జిల్లా -01మే (మహాప్రభ )** హవేలిఘనపూర్ మండలం తిమ్మాయిపల్లి గ్రామానికి చెందిన కొండయ్య గారి నారా గౌడ్ కుమార్తె వివాహం ఈనెల 6న జరగనుంది. ఈ వివాహం హవెలిఘనపూర్ మండల కేంద్రంలోని శ్రీ సాయి శ్రీనివాస ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం తిమ్మాయిపల్లి గ్రామ అధ్యక్షులు సూడ ప్రసాద్, మాజీ వార్డు సభ్యులు లింగంతో కలిసి నారగౌడ్ హైదరాబాదులోని కొంపల్లిలో మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మ దేవేందర్ రెడ్డిని వారి నివాసంలో కలసి వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు. తమ కుమార్తె వివాహానికి విచ్చేసి ఆశీర్వదించాలని నారా గౌడ్ కోరారు.

## జిల్లాల్లో మే 01 నుండి 31 వరకు

**-మెదక్ జిల్లా శాంతి భద్రతల పోలీస్ యాక్ట్ 1861 అమలు.**




**మెదక్ జిల్లా -01మే (మహాప్రభ** పరిరక్షణ దృష్ట్యా మే 01 నుండి 31వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా 30, 30(ఎ) పోలీసు యాక్ట్ -- 1861 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ శ్రీ డి.వి. శ్రీనివాస రావు, ఐపీఎస్ తెలిపారు. ఈ సమయంలో పోలీసు అధికారుల ముందస్తు అనుమతి లేకుండా ఏవిధమైన ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్స్, సభలు, సమావేశాలు నిర్వహించడం నిషేధమని జిల్లా ఎస్పీ తెలిపారు. అలాగే ప్రజల/ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించే చట్టవ్యతిరేక చర్యలు, అశాంతి సృష్టించే ప్రయత్నాలు ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. శాంతి భద్రతల నిర్వహణలో ఎవరైనా విఘాతం కలిగిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు ఈ విషయంలో పోలీసులు చేపడుతున్న చర్యలకు సహకరించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

## గొల్పర్తి పెద్దమ్మ ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్న మెదక్ ఎమ్మెల్యే రోహిత్.



**మెదక్ జిల్లా -01మే (మహాప్రభ )**
రామాయంపేట మండలం గోల్పర్తి గ్రామంలో శుక్రవారం జరిగిన పెద్దమ్మ ఆలయ వార్షికోత్సవంలో మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ పాల్గొన్నారు. దేవాలయానికి చేరుకున్న ఎమ్మెల్యే రోహిత్ కు ఆలయ నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం పెద్దమ్మ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే రోహిత్ మాట్లాడుతూ పెద్దమ్మ ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని స్వామివారిని వేడుకున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## విద్యుత్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మే డే శుభాకాంక్షలు.



**మెదక్ జిల్లా -01మే (మహాప్రభ ).** తెలంగాణ రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మేడే కార్మికుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మెదక్ సర్కిల్ కార్యాలయం ముందు జిల్లా అధ్యక్షులు అశోక్ ఘనంగా కార్మికుల జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మేడే అనేది సాధారణ పండుగ కాదని, కార్మికులు తమ హక్కుల సాధన కోసం రక్తం చిందించి సాధించిన చారిత్రాత్మక దినమని పేర్కొన్నారు. 1886లో అమెరికాలోని చికాగో నగరంలోని హే మార్కెట్ ప్రాంతంలో కార్మికులు 18 గంటల పని భారాన్ని 8 గంటలకు తగ్గించాలని డిమాండ్ చేస్తూ భారీ నిరసన కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు.
ఆ సమయంలో పోలీసులు జరిపిన కాల్పుల్లో అనేక మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారని, ఆ రక్తసిక్త పోరాటం నుంచే ఎర్రజెండా జన్మించిందని ఆయన గుర్తు చేశారు. ఆ త్యాగాల ఫలితంగా నేడు ప్రపంచవ్యాప్తంగా కార్మికుల హక్కులు పరిరక్షించబడుతున్నాయని చెప్పారు. కార్మికుల ఐక్యతే వారి బలం అని, తమ హక్కుల సాధన కోసం ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉస్మాన్, సాయిలు, తోపిక్ అలీ, వెంకటేశం, బిక్షపతి, అజీజ్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# స్త్రీ శిశు సంక్షేమ శాఖ-ఉయ్యాల కార్యక్రమం

**-జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు-**
**ఐ సి డి ఎస్, సిడిపిఓ చంద్రకళ**



**దేవరకొండ మే 1 ( మహాప్రభ )**
దేవరకొండ పట్టణంలో గల ప్రసూతి వైద్యశాల (ఏరియా హాస్పిటల్) మరియు ఆర్టీసీ బస్ స్టాండ్ లో అడాప్షన్ హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు సీఐ వెంకట్ రెడ్డి సిడిపిఓ చంద్రకళ ఆధ్వర్యంలో ఉయ్యాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ యొక్క కార్యక్రమం లో ముఖ్య అతిథిగా సిఐ వెంకట్ రెడ్డి , సిడిపిఓ చంద్రకళ, డీసీపీయు అంజలి మాట్లాడుతూ తల్లిదండ్రులకు భారంగా పెంచ లేని స్థితి అనిపించిన శిశువులను అనారోగ్యం కారణంగా జన్మించిన శిశువులను అలాగే శిశువులకు జన్మనిచ్చి సమాజానికి భయపడి జన్మనిచ్చిన శిశువులను ఎక్కడో చెత్తకుప్పలోను కాలువల్లోనూ పడేస్తూ ఎన్నో శిశు మరణాలకు కారణాలు అవుతున్న సమయం లో అటువంటి అనర్థాలు జరగకుండా ఉండడానికి ఈ ఉయ్యాల కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అని ఆమె




అన్నారు. అటువంటి శిశువులను ఈ యొక్క ఉయ్యాలలో వేయడం వలన ఆ యొక్క శిశువులను జిల్లా పరిధిలో గల శిశుగృహకు పంపించి ఆ యొక్క శిశువు ఆలనా పాలనను చూసుకోవడం జరుగుతుందని అలాగే ఎవరికైనా పిల్లలు దత్తత కావాలి అనుకుంటే అట్టి తల్లిదండ్రులకు లీగల్ గా చట్టపరమైన దత్తత ఇవ్వడం జరుగుతుంది తెలిపారు ఈ యొక్క విషయాన్ని ప్రతి ఒక్కరికి తెలిసేలా అందరూ కృషిచేయాలని వివరించారు .
ఈ కార్యక్రమంలో ఏరియా హాస్పటల్ సూపర్డెంట్ రవి ప్రకాష్ ,జిల్లా చైల్డ్ ప్రొటక్షన్ అంజలి సిడిపిఓ చంద్రకళ, సూపర్వైజర్స్ విజయలక్ష్మి, ఆర్టీసీ. డి ఎం , సూపర్వైజర్ ఏరియా హాస్పిటల్ డాక్టర్ స్. రవి ప్రకాష్ , కృష్ణ , మోతీలాల్ మరియు అంగన్వాడి టీచర్స్ తదితరులు పాల్గొన్నారు.

## కోటపోవులూరు బాధితులకు
# భరోసానిచ్చిన డీఎస్పీ చెంచు బాబు

**- బెల్ట్ షాపు దౌర్జన్యాలపై ఉక్కుపాదం**
**-కల్తీ మద్యం కాటుకు ముగ్గురు బలి.. న్యాయం కోసం డీఎస్పీ కార్యాలయం ముందు మహిళల నిరీక్షణ**
**-ఎమ్మెల్యేకు విన్నవించినా అందని పరిష్కారం: చివరికి డీఎస్పీని ఆశ్రయించిన కోటపోవులూరు మహిళలు.**
**-వెంట నే స్పందించిన డీఎస్పీ చెంచు బాబు.. నిందితులపై కఠిన చర్యలకు సిఐకి ఆదేశం**



**మే 01 తిరుపతి జిల్లా (నాయుడుపేట) మహాప్రభ** తమ గ్రామంలో ప్రాణాలు తీస్తున్న అక్రమ బెల్ట్ షాపులను అరికట్టాలని, తమకు రక్షణ కల్పించాలని కోరుతూ సూళ్లూరుపేట మండలం కోటపోవులూరు గ్రామం తూర్పు హరిజనవాడకు చెందిన మహిళలు నాయుడుపేట డీఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించారు. గత కొంతకాలంగా గ్రామంలో సాగుతున్న అక్రమ మద్య దందాపై గళమెత్తిన మహిళలు, మండుటెండను సైతం లెక్కచేయకుండా డీఎస్పీ చెంచు బాబు కోసం గంటల తరబడి నిరీక్షించారు.

**ముగ్గురి మృతి - నాయకులకు చెప్పినా మారని పరిస్థితి**

బాధిత మహిళలు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని ఒక వ్యక్తి చట్టవిరుద్ధంగా బెల్ట్ షాపు నిర్వహిస్తూ కల్తీ మద్యం విక్రయిస్తున్నాడు. ఆ మద్యం సేవించి గత ఒక్క నెలలోనే గ్రామంలో ముగ్గురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోవడం కలకలం రేపింది. ఈ అక్రమ దందాను ఆపేయాలని, ప్రాణాలు కాపాడాలని స్థానిక పోలీసులతో పాటు శాసనసభ్యురాలు డాక్టర్ నెలవల విజయశ్రీ దృష్టికి కూడా ఈ సమస్యను తీసుకెళ్లామని, అయినా ఆశించిన ఫలితం లేకపోవడంతో చేసేది లేక డీఎస్పీ చెంచు బాబు ని ఆశ్రయించామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రశ్నిస్తే బెల్ట్ షాపు నిర్వాహకులు మహిళలపై దౌర్జన్యాలకు పాల్పడుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని వారు పేర్కొన్నారు.

**మానవీయ కోణంలో స్పందించిన డీఎస్పీ చెంచు బాబు**

ఉదయం నుండి డీఎస్పీ కార్యాలయం ముందు పడిగాపులు కాస్తున్న మహిళల పరిస్థితిని గమనించిన డీఎస్పీ చెంచు బాబు, రాగానే వారిని కలిసి సమస్యను పూర్తిగా అడిగి తెలుసుకున్నారు. కల్తీ మద్యం వల్ల ప్రాణాలు పోవడం మరియు మహిళలపై దౌర్జన్యాలు జరగడంపై ఆయన తీవ్రంగా స్పందించారు. వెంటనే సూళ్లూరుపేట సిఐ తో ఫోన్‌లో మాట్లాడి, ఈ ఘటనపై తక్షణమే యాక్షన్ తీసుకోవాలని, అక్రమ బెల్ట్ షాపులను అరికట్టి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## ప్రపంచాన్ని నిర్మిస్తున్న కార్మికులందరికీ
# మే డే శుభాకాంక్షలు

**-ఒంటేరు ప్రతాపరెడ్డి.**




**మెదక్ జిల్లా -01మే (మహాప్రభ )**
మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపాలిటీ పరిధిలోని కార్మికుల సంఘాలతో కలిసి జండా ఆవిష్కరణలో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర మాజీ ఫారెస్ట్ డెవలప్మెంట్ చైర్మన్ ప్రతాపరెడ్డి కార్మికులను శాలువాతో సన్మానించారు మాట్లాడుతూ కార్మిక సంఘ నాయకులు దేశానికి వెన్నెముక లాంటిదని దేశ రక్షణ ఎంత ముఖ్యమో దేశ శుభ్రత కూడా అంతే ముఖ్యమని ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలంటే కార్మిక శ్రమ ఉంటుందని వారి ఫలితమే ప్రజల ఆరోగ్యమని అంతర్జాతీయ కార్మికుల దినోత్సవం . కార్మికులకు ఎనిమిది గంటల పని విధానం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ 1886, మే 1న షికాగోలని హే మార్కెట్లో జరిగిన పోరాటాన్నే నేడు 'మే డే'గా నిర్వహిస్తున్నారు. నాడు జరిగిన ఈ ఉద్యమానికి మద్దతుగా నాలుగు రోజుల తర్వాత షికాగోలోని హే మార్కెట్‌లో భారీ ప్రదర్శన నిర్వహించారు. అది ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో అనేక మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ మారణకాండను నిరసిస్తూ అనేక దేశాల్లో ఉద్యమాలు జరిగాయి. షికాగో మారణకాండలో ప్రాణాలర్పించిన కార్మికులను స్మరిస్తూ.. ఏటా మే 1వ తేదీన కార్మిక దినోత్సవం నిర్వహిస్తున్నారు. అప్పటి నుంచి మే 1వ తేదీన ప్రపంచవ్యాప్తంగా అనేక ఉద్యమాలకు మే డే వేదికగా మారింది. అనేక దేశాల్లో ఆ రోజున పోరాటాలూ, నిరసన ప్రదర్శనలూ చేపట్టడం పరిపాటైంది. 1923 నుంచి ఇండియాలో 'మే డే'ను పాటించారు తెలిపారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ రాథోడ్ జైపాల్ నాయక్ చెలిమెల రాములు బిఆర్ఎస్ పార్టీ నాయకులు రఘుపతి ప్రభాకర్ రెడ్డి కొక్కొండ కాశిరెడ్డి పోతురాజు ధనరాజ్ బుక్క విజయకుమార్ సతీష్ చారి బజారు చక్రవర్తి నాగేంద్ర కార్మిక సంఘ నాయకులు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ కార్మికుల పండుగగా మే డే ఘనంగా నిర్వహణ



**కూకట్పల్లి, మే 01 (మహాప్రభ):**
ప్రపంచ కార్మికుల హక్కులను గుర్తించిన దినంగా మే డేను ప్రపంచ వ్యాప్తంగా కార్మికులు జరుపుకుంటున్నారని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ తెలిపారు. మే డే సందర్భంగా శుక్రవారం నియోజకవర్గ పరిధిలో పలుచోట్ల స్థానిక నాయకులతో కలిసి ఆయన ఐఎన్టీయూసీ జెండాను ఆవిష్కరించారు. ముందుగా పార్టీ నాయకుడు లక్ష్మణ్ గౌడ్ ఆహ్వానం మేరకు ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని బండి రమేష్ ప్రారంభించారు. ఈ హెల్త్ క్యాంపులో అధిక సంఖ్యలో కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. సుమారు 100 మంది జిహెచ్ఎంసి కార్మికులకు ఆయన చేతుల మీదుగా పండ్లు, చీరలను పంపిణీ చేశారు. అనంతరం మూసాపేటలో ఐఎన్టీయూసీ నాయకుడు కర్క నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బండి రమేష్ పార్టీ పథకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక చట్టాలను గౌరవించి, కార్మికుల హక్కులను చట్టబద్ధంగా అమలు చేసిన పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని తెలిపారు. కార్మికుల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. మే డే వేడుకలు అమెరికాలో ప్రారంభమైనప్పటికీ నేడు ప్రపంచవ్యాప్తంగా నిర్వహించబడుతున్నాయని, ఇది ప్రతి కార్మికుడికి గర్వకారణమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మయ్య, గాలి బాలాజీ, నాగిరెడ్డి, పుష్పరెడ్డి, గంధం రాజు, దినేష్ కుమార్, రంగమోహన్, రాఘవేందర్, సతీష్, నరసింహా, మస్తాన్ రెడ్డి, కనకయ్య, సుంకన్న, మొయిజ్, వేణు, భారతి, రేష్మతో పాటు అమర్ హాస్పిటల్స్ వైద్యులు, సిబ్బంది మరియు జిహెచ్ఎంసి కార్మికులు పాల్గొన్నారు.

# కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

-కార్మికుల కష్టాలను గుర్తిస్తూ, వారి సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉంది.
-జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.



**మెదక్ జిల్లా -01మే (మహాప్రభ ).**
శుక్రవారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో 99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాల శాఖ ఆధ్వర్యంలో మేడే వేడుకలు – 2026 ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ నగేష్,కార్మిక శాఖ సహాయ కమిషనర్ శ్రీమతి సాహితి, జడ్పి సీఈఓ ఎల్లయ్య తో కలిసి కలెక్టర్ ప్రతిమా సింగ్ ముఖ్య అతిథిగా హాజరై, జ్యోతి ప్రజ్వలన గావించి ఆరంభించారు.కలెక్టర్ మాట్లాడుతూ. ముందుగా అందరికీ కార్మిక దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్మికుల సంక్షేమమే సమాజ అభివృద్ధికి పునాది అని పేర్కొన్నారు. కర్మాగారాల్లో పని చేస్తున్న కార్మికులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కార్మిక సంఘాలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్మికులకు సరైన సబ్సిడీలు, బీమా సదుపాయాల సమస్యలను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్మికుల హక్కుల పరిరక్షణలో కార్మిక సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని, అన్ని సంఘాలు కలిసికట్టుగా పనిచేస్తే సమస్యలకు సమగ్ర పరిష్కారం సాధ్యమవుతుందని తెలిపారు.అలాగే ప్రతి కార్మికుడికి అవసరమైన సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. అంతకుముందు కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని కార్మికుల సంక్షేమం, కర్మాగారాల కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, కార్మిక సంఘాల పాత్రపై ప్రత్యేక శిక్షణ ఇచ్చి, అవగాహన కల్పించారు. అనంతరం కార్మికుల సాధనాలు, కార్యక్రమాల నివేదిక పోస్టర్స్ ను ఆవిష్కరించారు.కార్మిక శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత పరిశ్రమల శాఖ యాజమాన్యం ఐ.టీ.సీ ఫ్యాక్టరీస్.సిబ్బంది కార్మిక శాఖ అధికారులు పాల్గొన్నారు.

# మే డే స్ఫూర్తితో ఎనిమిది గంటల పని దినానికై ఉద్యమిద్దాం

-సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కంబాలపల్లి ఆనంద్



**దేవరకొండ మే 01( మహాప్రభ)**
నియోజకవర్గంలోని పి.ఏ.పల్లి. భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు ) పీఏ పల్లి మండల కేంద్రంలో గనిపల్లి శాఖ మాదాపురం అజ్మాపురం సిపిఎం గ్రామాల శాఖల ఆధ్వర్యంలో మే డే సందర్భంగా పార్టీ జెండా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కంబాలపల్లి ఆనంద్ ఎగురవేశారుజరిగింది. అనంతరంసిపిఎంజిల్లా కమిటీసభ్యులు కంబాలపల్లిఆనంద్ మాట్లాడుతూ 140 సంవత్సరాల క్రితం అమెరికాలోని చికాగో నగరంలో ఎనిమిది గంటల పని దినం అమలు చేయాలని, పనికి తగిన ప్రతిఫలం ఇవ్వాలని, పని స్థలాల్లో మెరుగైన పరిస్థితులు కల్పించాలని కార్మికులు పెట్టుబడిదారుల శ్రమదోపిడీకి వ్యతిరేకంగా పోరాడారు. ఆ పోరాట ఫలితంగానే ఎనిమిది గంటల పని దినాన్ని సాధించుకున్నారనని ఆయన తెలిపారు.
1886 మే 1న జరిగిన ఈ పోరాటాన్ని ప్రపంచవ్యాప్తంగా కార్మిక వర్గ పోరాట దినంగా గుర్తిస్తూ గా ఆయన తెలిపారు . ఆ ఉద్యమంలో ఎనిమిది మంది కార్మిక నాయకులు తమ ప్రాణాలను అర్పించగా, వారి త్యాగాల ఫలితంగానే నేడు ప్రపంచవ్యాప్తంగా ఎనిమిది గంటల పని దినం అమలవుతోంది ఆయన అన్నారు. గనిపల్లి పీఏ పల్లి మండల కేంద్రం అజ్మాపూర్ మాదాపురం గ్రామాలలో జెండా ఆవిష్కరణ అనంతరం మాట్లాడిన కంబాలపల్ల ఆనంద్ ఆ పోరాట స్ఫూర్తిని తీసుకొని నేడు కార్మిక వర్గంపై పెరుగుతున్న పనిభారం, పని గంటల పెంపు, శ్రమదోపిడీకి వ్యతిరేకంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. భారతదేశంలో కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందని, 12 గంటల పని దినాలను తీసుకురావడం దుర్మార్గమైన విధానమని విమర్శించారు. కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా కార్మిక చట్టాల స్థానంలో నాలుగు లేబర్ కోడ్స్‌ను అమలు చేయడం ద్వారా కార్మికులపై మరింత శ్రమదోపిడీ పెరుగుతుందని తెలిపారు.
పనిగంటల పెంపు, సమ్మె హక్కు హరించడం, తక్కువ వేతనాలతో పని చేయించడం వంటి చర్యల ద్వారా కార్మికులపై ఒత్తిడి పెరుగుతోందని, ఈ పరిస్థితుల్లో కార్మికులు, కర్షకులు, సామాజిక ప్రజా సంఘాలు కలిసి పోరాడాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కావలి కృష్ణయ్య,పెరిక విజయ్ కుమార్, SFI జిల్లా కార్యదర్శి ఖమ్మంపాటి శంకర్ శాఖ కార్యదర్శులు కంబాలపల్లి చిరంజీవి ధర్మాపురం దానయ్య సేవ తదితరులు పాల్గొన్నారు

# 140వ మేడే స్ఫూర్తితో నాలుగు లేబర్ కోడ్స్ రద్దుకై ఉద్యమిద్దాం

-సమాన పనికి సమాన వేతనంకై ఉద్యమీద్దాం....
-మేడే వారోత్సవాలు జయప్రదం చేయండి ....
-సిఐటియు మెదక్ జిల్లా ఉపాధ్యక్షుడు ఏ మహేందర్ రెడ్డి




**శివంపేట,మే 1 (మహాప్రభ):**
శివ్వంపేట మండల కేంద్రంలో 140 వ మేడే సందర్భంగా సిఐటియు ఆధ్వర్యంలో ఘనంగా సిఐటియు జెండావిష్కరణలు ఘనంగా ఎగరవేయడం జరిగిందని ఆయన అన్నారు. చిన్న గొట్టిమకుల,గోమారం ఆటో యూనియన్ ఆధ్వర్యంలో,విద్యుత్ కార్యాలయం వద్ద విద్యుత్ రంగం కార్మికుల ఆధ్వర్యంలో గూడూరు, చండి,దొంతి, చెన్నపూర్ గ్రామాలతో పాటు వివిధ గ్రామాలలో వివిధ రంగాల కార్మికులతో సిఐటియు జెండాలో ఆవిష్కరణ జరిగాయని,ఈ సందర్భంగా సిఐటీయు జిల్లా ఉపాధ్యక్షులు ఏ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ నాయకత్వంలో బిజెపి ప్రభుత్వం అధికారానికి వచ్చిన గత 13 సంవత్సరాల నుండి కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్నది.బడా కార్పొరేట్ల ప్రయోజనాల కోసం 100 సంవత్సరాల క్రితం నుండి బ్రిటిష్ కాలం నుండి పోరాడి సాధించుకున్న అనేక కార్మిక చట్టాలను కలిపి వేసి 4 లేబర్ కోడ్స్ ను తీసుకొచ్చింది. ఈ నాలుగు లేబర్ కోడ్స్ అమల్లోకి తెస్తూ కార్మిక వర్గానికి సంఘం పెట్టుకునే హక్కు, సంఘటితమై హక్కు కనీస వేతనం అడిగే హక్కు పిఎఫ్, ఈఎస్ఐ వంటి చట్టబద్ధ సౌకర్యాలకు నోచుకోకుండా కార్మిక వర్గానికి తీవ్ర నష్టం కలిగిస్తున్న కేంద్ర బిజెపి ప్రభుత్వం నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా కార్మిక కర్షక కార్మిక వర్గం ఐక్యతగా పోరాడాలని పిలుపునిచ్చారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని దేశంలో సంఘటిత అసంఘటిత కార్మికులకు కనీస వేతనాలు లేక ఉద్యోగ భద్రత లేక చాలా ఇబ్బంది గురవుతున్నారు. అమెరికా చికాగో నగరంలో 8 గంటల పని దినానికై ఉవ్వెత్తున కార్మిక వర్గం పోరాటం చేసి రక్త తర్పణంలో రక్తంలో తడిసిన గుడ్డని ఎర్రజండగా మేడే జెండా ఎగరడం జరిగింది. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న సరళీకరణ నూతన విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు ఐక్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ సువర్ణ, హమాలి నాయకులు ముత్యాలు, ఆశారంగం మండల నాయకులు రేణుక, విద్యుత్ రంగం జిల్లా అడ్వైజర్ స్వామి, సలీం, అశోక్ ప్రవీణ్ ,మహేష్ మిషన్ భగీరథ రంగం నాయకులు నర్సింలు, స్వామి, గ్రామపంచాయతీ మండల అధ్యక్ష కార్యదర్శులు వెంకటేష్, శంకర్, ఆటో యూనియన్ నాయకుల ఆంజనేయులు అనిల్ ,శంకర్,లక్ష్మి, కుమ్మరి కృష్ణ, ఆంజనేయులు, వసంత,నర్సమ్మ ,మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# నర్సాపూర్ నియోజకవర్గ రైతులకు ముఖ్య విజ్ఞప్తి

**నర్సాపూర్ మే 1 (మహాప్రభ):**
మెదక్ జిల్లా తెలంగాణ రైతు రక్షణ సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ ముఖ్య సూచన చేశారు. నర్సాపూర్ “నియోజకవర్గంలోని చాలా గ్రామాలలో ఇంకా ఐకేపీ సెంటర్లు, పిఎసిఎస్ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. ఇదే సమయంలో అకాల వర్షాలు పడే పరిస్థితి ఉండడంతో, ఇప్పటికే కోతలు పూర్తి చేసిన ధాన్యం దెబ్బతినే ప్రమాదం ఉంది. కాబట్టి సంబంధిత అధికారులు వెంటనే స్పందించి కొనుగోలు కేంద్రాలను తక్షణమే ఏర్పాటు చేయాలి




రైతుల నుండి సరైన సమయంలో ధాన్యాన్ని కొనుగోలు చేయాలి ట్రాన్స్పోర్టేషన్ సౌకర్యాలను సమయానికి కల్పించాలి రైతులు ప్రైవేట్‌గా అమ్ముకుంటే నష్టపోయే అవకాశం ఉంది. అందువల్ల రైతులందరూ జాగ్రత్తగా ఉండాలి. నియోజకవర్గంలో ఎక్కడైనా సమస్యలు ఉంటే తనకు తెలియజేయగలరు అని అన్నారు.

# కొంతాన్‌పల్లి గ్రామంలో ఘనంగా మేడే వేడుకలు

-గ్రామపంచాయతీ సిబ్బందికి శాలువాలతో సన్మానం




**శివంపేట, మే 01(మహా ప్రభ):**
శివంపేట్ మండల్ కొంతాన్‌పల్లి గ్రామంలో మేడే సందర్భంగా గ్రామపంచాయతీ సిబ్బందిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి తాజా మాజీ గ్రాూజూ చైర్మన్ చింతల వెంకట్ రామ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై సిబ్బందికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ అభివృద్ధిలో గ్రామపంచాయతీ సిబ్బంది చేస్తున్న సేవలు ఎంతో ప్రశంసనీయమని అన్నారు. వారి కృషి వల్లే గ్రామంలో శుభ్రత, పారిశుద్ధ్యం, అభివృద్ధి కార్యక్రమాలు సమర్థవంతంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సెక్రటరీ రాధిక, ఉప సర్పంచ్ బొల్లారం కుమార్ ముదిరాజ్, వార్డు సభ్యులు ఉప్పరి సంతోష్ కుమార్, గుండు వేణుగోపాల్, సారా శంకర్ లాల్, టేకులపల్లి రవీందర్ రెడ్డి, చాకలి శ్రీనివాస్, కలకంటి వెంకటేష్, గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతి ఫలితాల్లో ప్రతిభ చాటిన విద్యార్థినులకు సన్మానం



**శివంపేట మే 01 (మహాప్రభ)**
పదవ తరగతి ఫలితాల్లో పిల్లుట్ల గ్రామానికి చెందిన గులయ్యగారి శ్రీశైలం కుమార్తె హారిక మరియు మంగళపర్తి శ్రీశైలం కుమార్తె శ్రీ వర్షిని ఇద్దరూ 541 మార్కులు సాధించి 9.0 GPAతో ఉత్తీర్ణత సాధించారు. గతంలో గ్రామ సర్పంచ్ బుర్ర మురళి గౌడ్ 9.5 GPA సాధించిన విద్యార్థులకు 5000 బహుమతి ఇస్తామని ప్రకటించినప్పటికీ, ఈ ఇద్దరు విద్యార్థినులు అత్యుత్తమ ప్రతిభ కనబరచినందుకు ప్రత్యేకంగా అభినందిస్తూ, ఒక్కొక్కరికి 2000 చొప్పున నగదు బహుమతి అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, “ఇకముందు కూడా మరింత కష్టపడి చదివి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలి” అని విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు రాఘవరెడ్డి , పిల్లుట్ల ఆలయ కమిటీ చైర్మన్ పెద్దపులి ఆంజనేయులు , వార్డు సభ్యులు గొల్ల బిక్షపతి , పిల్లి మధు , తలారి హనుమంతు , యువ నాయకుడు పెద్దపులి సతీష్ , ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి గులయ్య రవీందర్ , కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బెస్త కృష్ణయ్య, గులయ్య కిష్టయ్య, రామచంద్రం , గ్రామ సెక్రటరీ నాగేష్ , బుర్ర వినయ్ మరియు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# ఘనం గా జరిగిన బేటి బచావో- బేటి పడవో

సూపర్వైజర్ డి .చిట్టిమ్మ




**దేవరకొండ మే1 ( మహాప్రభ )**
దేవరకొండ మండలం ముదిగొండ గ్రామం నందు బేటి బచావో- బేటి పడవో కార్యక్రమం నిర్వహించారు. డి చిట్టెమ్మ సూపర్వైజర్ మాట్లాడుతూ మహిళల హక్కులు, బాల్యవివాహాల నిర్మూలన, మారకద్రవ్యాల వినియోగం సైబర్ క్రైమ్ నేరాలపై.మిషన్ వాత్సల్య పథకం పై అక్రమ దత్తత పై చైల్డ్ హెల్ప్ లైన్ పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న కొంత విజయలక్ష్మి మల్లేష్ మాట్లాడుతూ బాల్య వివాహాలు నిర్మలనకు కృషి చేయాలని అదేవిధంగా విద్యార్థులు మంచిగా చదువుకోవాలని చెడు స్నేహాలకు, చెడు అలవాట్లకు, దూరంగా ఉండాలనిసూచించారు , చిన్నపిల్లలకు స్మార్ట్ ఫోన్లు ఇవ్వరాదని తెలియపరిచారుఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్,విజేత,రమణ, ఆశ వర్కర్ సునీత,గ్రామంలోని కిషోర బాలికలు, తల్లులు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు..

# బిజినెస్

## మార్కెట్లోకి ఓబెన్ సరికొత్త స్పోర్టీ ఎలక్ట్రిక్ బైక్..

### అదిరిపోయే లుక్స్, పవర్‌ఫుల్ పర్ఫార్మెన్స్!



ఎలక్ట్రిక్ వెహికల్ మార్కెట్లో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న 'ఓబెన్' కంపెనీ, ఇప్పుడు స్పీడ్, స్టైల్ కోరుకునే రైడర్ల కోసం ఒక క్రేజీ అప్‌డేట్ ఇచ్చింది. సరికొత్త స్పోర్టీ ఎలక్ట్రిక్ మోటార్‌సైకిల్‌కు సంబంధించిన టీజర్‌ను విడుదల చేస్తూ ఆటోమొబైల్ ప్రేమికుల్లో ఆసక్తిని రేకెత్తించింది. ఈ కొత్త మోడల్ ఏప్రిల్ 30న అధికారికంగా లాంచ్ కానుంది.

**అగ్రెసివ్ డిజైన్- నయా లుక్:**
సాధారణ కమ్యూటర్ బైక్‌లలా కాకుండా, ఈ కొత్త బైక్ పూర్తి స్పోర్టీ లుక్‌తో కనిపిస్తోంది. టీజర్‌లో చూపిన వివరాల ప్రకారం:

**హెడ్‌లైట్:** సింగిల్ LED DRL తో కూడిన ప్రొజెక్టర్ హెడ్‌ల్యాంప్ బైక్‌కు అగ్రెసివ్ లుక్‌ను ఇస్తోంది.

**మోడ్రన్ స్టైల్:** గతంలో ఓబెన్ మోడల్స్ రెట్రో డిజైన్‌తో ఉండగా, ఈ కొత్త వెర్షన్ మాత్రం యువతను ఆకట్టుకునేలా షార్ప్, మోడ్రన్ ఎడ్జెస్‌తో రూపొందించింది.

**పర్ఫార్మెన్స్ సెగ్మెంట్‌లోకి ఎంట్రీ:**
ఓబెన్ కంపెనీ ఇప్పటివరకు బడ్జెట్, ఎంట్రీ లెవల్ విభాగాలపై దృష్టి సారించింది. కానీ, ఈ కొత్త మోడల్‌తో ప్రీమియం, హై-పర్ఫార్మెన్స్ సెగ్మెంట్‌లోకి అడుగుపెడుతోంది. స్పీడ్‌ను ఇష్టపడే రైడర్ల కోసం శక్తివంతమైన ఎలక్ట్రిక్ మోటార్‌ను ఇందులో అమర్చినట్లు సమాచారం.

**బ్యాటరీ, రేంజ్ అంచనాలు:**
ఈ బైక్‌లో పెద్ద సామర్థ్యం గల బ్యాటరీ ప్యాక్ ఉండే అవకాశం ఉంది. ఒక్కసారి ఛార్జ్ చేస్తే మెరుగైన రేంజ్‌తో పాటు, టాప్ స్పీడ్ కూడా ఆకట్టుకునేలా ఉంటుందని విశ్లేషకులు భావిస్తున్నారు. పూర్తి స్పెసిఫికేషన్లు, ధర, డెలివరీ వివరాలను ఏప్రిల్ 30న లాంచ్ సందర్భంగా కంపెనీ వెల్లడించనుంది. లాంచ్ రోజే బుకింగ్‌లు కూడా ప్రారంభమయ్యే అవకాశం ఉన్నందున, మంచి ఎలక్ట్రిక్ స్పోర్ట్స్ బైక్ కోసం ఎదురుచూస్తున్న వారికి ఇది బెస్ట్ ఆప్షన్ కానుంది.

## మగువలకు తీపి కబురు.. భారీగా తగ్గిన బంగారం, వెండి ధరలు..

ఎంతో తెలిస్తే ఇప్పుడే కొనేస్తారు..!

బంగారం, వెండి ప్రియులకు గుడ్‌న్యూస్.. గతంలో పరుగులు పెట్టిన ఈ రెండు లోహాల ధరలు ఇప్పుడు భారీ స్థాయిలో దిగి వస్తున్నాయి. రోజురోజుకు భారీ స్థాయిలో దిగి వస్తుండటంతో మహిళలకు ఎంతో ఉపశమనం కలుగుతుందనే చెప్పాలి. గత రెండు, మూడు రోజుల నుంచి బంగారం, వెండి ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. రెండు రోజుల్లోనే తులం బంగారంపై ఏకకంగా రూ.3 వేల వరకు దిగి వచ్చింది. అదే వెండిపై ఏకంగా రూ.10 వేల వరకు తగ్గింది.

మే 1వ తేదీన 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,50,670 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,38,110 వద్ద కొనసాగుతోంది. అదే 18 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,13,000 వద్ద ట్రేడవుతోంది. ఇక వెండి విషయానికొస్తే కిలో వెండి ధర కూడా గత మూడు, నాలుగు రోజుల్లో భారీగా తగ్గింది. ప్రస్తుతం దేశీయంగా కిలో వెండి ధర రూ.2,49,000 వద్ద కొనసాగుతోంది.



**ప్రధాన నగరాల్లో ధరల వివరాలు:**
హైదరాబాద్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,50,670 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,38,110 వద్ద ఉంది.
విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,50,670 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,38,110 వద్ద ఉంది.
ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,50,820 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,38,260 వద్ద ఉంది.
ముంబైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,50,670 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,38,110 వద్ద ఉంది.
బెంగళూరులో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,50,670 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,38,110 వద్ద ఉంది.
కేరళలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,50,670 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,38,110 వద్ద ఉంది.
చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,53,830 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,41,010 వద్ద ఉంది.
ఇక వెండి ధర విషయానికొస్తే..
హైదరాబాద్, చెన్నై, కేరళలో భారీగా ఉంది. ఇక్కడ కిలో వెండి ధర రూ.2,70,000 వద్ద కొనసాగుతుండగా, ముంబై, ఢిల్లీ, బెంగళూరులలో రూ.2,49,900 వద్ద కొనసాగుతోంది.ప్రస్తుతం స్టాక్ మార్కెట్లో కొనసాగుతున్న లాభాల స్వీకరణ, అలాగే పెరుగుతున్న ముడి చమురు ధరలతో ముడిపడి ఉన్న ద్రవ్యోల్బణ ఆందోళనల కారణంగా బంగారంపై ఒత్తిడి కొనసాగుతోంది. అయితే డాలర్ విలువ పెరుగుతున్న నేపథ్యంలో బంగారం ధర తగ్గుతోంది. అధిక చమురు ధరలు, యూఎస్ ఫెడరల్ రిజర్వ్ తన ద్రవ్య విధానంపై కఠిన వైఖరిని కొనసాగించే అవకాశాన్ని మరింత బలపరుస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. అమెరికా, ఇరాన్‌ల మధ్య కొనసాగుతున్న అనిశ్చితి నేపథ్యంలో, ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లపై అధికారుల ఆలోచన చేస్తున్నారు.

## ఏప్రిల్‌లో జి ఎస్ టి వసూళ్లు రూ.2.43 లక్షల కోట్లు

**న్యూఢిల్లీ**
: దేశంలో స్థూల వస్తు, సేవల పన్ను వసూళ్లు (జి ఎస్ టి ) రికార్డు స్థాయిలో నమోదయ్యాయి. ఏప్రిల్ నెలకు గానూ 8.7 శాతం వృద్ధితో రూ.2.43 లక్షల కోట్ల మేర వసూళ్లైనట్లు సంబంధిత వర్గాలు శుక్రవారం తెలిపాయి. ప్రభుత్వ గణాంకాల ప్రకారం.. దేశీయంగా విక్రయాలు పెరగడం, దిగుమతుల కారణంగా పన్ను వసూళ్లు ఈ స్థాయిలో పెరిగినట్లు పేర్కొన్నాయి. 2025 ఏప్రిల్‌లో రూ.2.37 లక్షల కోట్లు వసూలవగా, గత నెల కూడా జి ఎస్ టి వసూళ్లు రూ.2 లక్షల కోట్లు దాటిన సంగతి తెలిసిందే. అంతర్జాతీయంగా అనిశ్చిత పరిస్థితులు ఉన్నప్పటికీ..



కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభ నెల కావడంతోనూ వసూళ్లు పెరిగినట్లు ఆ వర్గాలు వెల్లడించాయి. రిఫండ్ల సర్దుబాటు అనంతరం ఏప్రిల్ నెలకు నికరంగా జి ఎస్ టి వసూళ్లు రూ.2.11 లక్షల కోట్లుగా ఉన్నాయి. దేశీయంగా విక్రయాల ద్వారా 4.3 శాతం వృద్ధితో రూ.1.85 లక్షల కోట్ల మేర జి ఎస్ టి ఆదాయం సమకూరిందని, దిగుమతుల రూపంలో 25.8 శాతం వృద్ధితో రూ.53,861 కోట్ల వసూళ్లు నమోదైనట్లు వెల్లడించాయి.

## కెప్టెన్ హార్దిక్ పాండ్యా నిందించడం సరికాదు

### వెస్టిండీస్ దిగ్గజం ఇయాన్ బిషప్

ఐపీఎల్ 2026లో ముంబై ఇండియన్స్ పరిస్థితి చాలా దారుణంగా ఉంది. ఆడిన ఎనిమిది మ్యాచుల్లో ఆరు ఓటములతో ప్లేఆఫ్ ఆశలు గల్లంతయ్యే స్థితిలో ఉన్న ఈ టీమ్ ప్రదర్శనపై ఇప్పుడు తీవ్రంగా చర్చ కొనసాగుతోంది. అయితే జట్టు వైఫల్యానికి కేవలం కెప్టెన్ హార్దిక్ పాండ్యాని మాత్రమే బాధ్యుడిని చేయడం సరికాదని వెస్టిండీస్ దిగ్గజం ఇయాన్ బిషప్ అభిప్రాయపడ్డారు. సూర్యకుమార్ యాదవ్, జస్ప్రీత్ బుమ్రా వంటి స్టార్ ప్లేయర్లు కూడా బాధ్యత తీసుకోవాలని ఆయన సూచించారు. ముంబై ఇండియన్స్ ఎదుర్కొంటున్న వరుస ఓటములపై హార్దిక్ పాండ్యా స్పందిస్తూ.. తన వ్యక్తిగత ఫామ్ మెరుగుపడాల్సిన అవసరం ఉందని నిజాయితీగా అంగీకరించాడు. అయితే ఇయాన్ బిషప్ మాట్లాడుతూ.. "జట్టు ఫెయిల్యూర్ లో ఒక్క వ్యక్తిని బాధ్యుడిని చేయడం తప్పు. కెప్టెన్ దగ్గర ఎన్ని ప్లాన్స్ ఉన్నా, ప్లేయర్లు మైదానంలో రాణించకపోతే ఫలితం ఉండదు. హార్దిక్ వ్యూహాలు మార్చుకోవచ్చు, కానీ అతనికి స్టార్ ప్లేయర్ల సపోర్ట్ చాలా అవసరం" అని అన్నారు. సన్ రైజర్స్ తో జరిగిన గత మ్యాచ్ లో 243 పరుగులు చేసి కూడా కాపాడుకోలేకపోవడం ముంబై





బౌలింగ్ వైఫల్యాన్ని ఎత్తిచూపుతోంది. ముంబై టీమ్ లో ప్రధాన బలమైన సూర్యకుమార్ యాదవ్, జస్ప్రీత్ బుమ్రా ఈ సీజన్ లో ఆశించిన స్థాయిలో రాణించడం లేదు. సూర్యకుమార్ 8 మ్యాచుల్లో కేవలం 162 పరుగులు మాత్రమే చేశాడు, అతని సగటు 20కి పడిపోయింది. ఇక బుమ్రా పరిస్థితి మరీ ఘోరం. ఐపీఎల్ చరిత్రలోనే ఇది అతనికి అత్యంత కష్టతరమైన సీజన్ అని చెప్పొచ్చు. ఆడిన 8 మ్యాచుల్లో అతను కేవలం రెండు వికెట్లు మాత్రమే తీయగలిగాడు. ప్రపంచ స్థాయి బౌలర్ ఇలాంటి ప్రదర్శన ఇస్తాడని ఎవరూ ఊహించలేదు. టీ20 ప్రపంచకప్ 2026 గెలిచిన తర్వాత బుమ్రా, సూర్య వంటి కీలక ఆటగాళ్లకు తగినంత విశ్రాంతి దొరకలేదని బిషప్ విశ్లేషించారు. "వరల్డ్ కప్ గెలవడానికి వారు ఎంతో శ్రమించి ఉంటారు. మానసికంగా, శారీరకంగా వారు అలసిపోయి ఉండొచ్చు. నిజానికి బుమ్రా వంటి బౌలర్ కు ఐపీఎల్ కు ముందు తగినంత బ్రేక్ ఇచ్చి ఉంటే బాగుండేది. అప్పుడు అతను కొత్త ఉత్సాహంతో, తన నైపుణ్యాలను మెరుగుపరుచుకుని బరిలోకి దిగేవాడు" అని బిషప్ అభిప్రాయపడ్డారు. ముంబై ఇండియన్స్ ఇప్పుడు అత్యంత క్లిష్ట పరిస్థితిలో ఉంది. ప్లేఆఫ్స్ రేసులో నిలవాలంటే మిగిలిన ఆరు మ్యాచుల్లోనూ కచ్చితంగా గెలవాల్సిందే. ఒక్క మ్యాచ్ ఓడినా ఇంటికి వెళ్లడం ఖాయం. ఈ పరిస్థితిలో కేవలం హార్దిక్ పాండ్యా వైపు చూడకుండా, జట్టులోని ప్రతి ఆటగాడు బాధ్యత తీసుకుని రాణించాల్సిన సమయం ఆసన్నమైంది. పోలార్డ్, జయవర్ధనే వంటి దిగ్గజాలు కూడా ఇదే విషయాన్ని నొక్కి చెప్పారు.

## అదరగొట్టిన లక్ష్య సేన్, ఆయుశ్..

## సెమీఫైనల్లో భారత్..!

ప్రతిష్ఠాత్మక థామస్ కప్‌లో భారత షట్లర్లు అదరగొట్టారు. లక్ష్య సేన్, ఆయుశ్ శెట్టి లు రాణించడంతో టీమిండియా సెమీ ఫైనల్‌కు దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్‌లో ఈ ఇద్దరూ, డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్ -- చిరాగ్ శెట్టి ద్వయం చెలరేగడంతో చైనీస్ తైపీపై 3-0 విజయంతో భారత్ పతకానికి చేరువైంది.డెన్మార్క్ వేదికగా జరుగుతున్న థామస్ కప్ కీలక మ్యాచ్‌లో భారత షట్లర్లు తడాఖా చూపించారు. క్వార్టర్ ఫైనల్లో లక్ష్య సేన్, ఆయుశ్ శెట్టి, సాత్విక్ -- చిరాగ్ జోడీ టాప్ గేర్‌లో ఆడడంతో చైనీస్ తైపీపై 3-0తో విజయం సాధించింది టీమిండియా. తొలుత సేన్ సింగిల్స్‌లో అతికష్టమ్మీద నెగ్గాడు. చౌ థియెన్ చెన్ ధాటికి తొలిసెట్ కోల్పోయినా పట్టువదలని భారత ఆటగాడు రెండో సెట్‌ను 22-10తో



గెలుచుకున్నాడు.నిర్ణయాత్మక మూడో సెట్‌లోనూ సేన్ అటాకింగ్ గేమ్‌తో ప్రత్యర్థిని ఉక్కిరిబిక్కిరి చేశాడు. సెట్ ఆసాంతం జోరు చూపించి 21-17తో గెలుపొంది ఆధిక్యాన్ని 1-0కు పెంచాడు. డబుల్స్‌లో సాత్విక్ చిరాగ్ ద్వయం చియు షియాంగ్ -- వాంగ్ చి లిన్ జంటను చిత్తు చేసింది. నెట్ వద్ద చురుకుగా కదిలిన భారత జోడీ.. 23-11, 19-21, 21-12తో మ్యాచ్‌ను సొంతం చేసుకుంది.

**ఛాంపియన్‌కు చెక్ పెట్టి..**
ఇటీవలే ఆసియా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో రన్నరప్‌గా నిలిచిన ఆయుశ్ శెట్టి సైతం విజయంతో చైనీస్ తైపీ ఆశలపై నీళ్లు చల్లాడు. 48 నిమిషాల పాటు సాగిన మ్యాచ్‌లో అతడు ఆల్ ఇంగ్లండ్ ఛాంపియన్ లిన్ చున్ యూని మట్టికరిపించాడు. 21-16, 21-17తో లిన్‌పై సంపూర్ణ ఆధిపత్యం చెలాయించిన ఆయుశ్ భారత్ ఆధిక్యాన్ని 3-0కు పెంచగా.. సెమీస్ బెర్తు ఖాయమైంది.

# స్పోర్ట్స్

## టెస్ట్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో ఆస్ట్రేలియా జట్టు






ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ తాజా ర్యాంకింగ్స్ విడుదల చేసింది. వార్షిక టెస్ట్ ర్యాంకింగ్స్ ఇవి. అలాగే వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్ టోర్నమెంట్ కు సంబంధించిన పాయింట్ల పట్టిక కూడా విడుదల అయింది. ఏడాది కాలంలో ఆయా జట్లు ఆడిన టెస్ట్ మ్యాచ్ లు, వాటిల్లో సాధించిన విజయాల ఆధారంగా తాజా ర్యాంకింగ్స్ ను రూపొందించింది ఐసీసీ. ఈ టెస్ట్ ర్యాంకింగ్స్‌లో ఆస్ట్రేలియా జట్టు అగ్రస్థానంలో నిలిచింది. వార్షిక ర్యాంకింగ్‌ల ప్రకారం.. ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో ఆస్ట్రేలియా 87.50 శాతంతో అగ్రగామిగా ఉంది. న్యూజిలాండ్ 77.78 శాతంతో రెండో స్థానంలో నిలిచింది. భారత జట్టు మూడో స్థానాన్ని దక్కించుకుంది. టెస్ట్ ఫార్మట్ ఆస్ట్రేలియా తన నంబర్ వన్ స్థానాన్ని నిలబెట్టుకుంటూ వస్తోంది.. ఏడాది కాలంగా. ఇందులో తన పాయింట్లను మరింత మెరుగుపర్చుకుంది. ఏకంగా మూడు అదనపు పాయింట్లను సాధించింది. దీంతో ఆ జట్టు ఖాతాలో ఉన్న పాయింట్ల సంఖ్య 131కి చేరుకుంది. టెస్ట్ ర్యాంకింగ్స్‌లోని మొదటి రెండు స్థానాలపై ఎటువంటి ప్రభావం చూపలేదు. ఆస్ట్రేలియాతో పాటు దక్షిణాఫ్రికా కూడా ఈ ఫార్మట్ లో తన అధిపత్యాన్ని కొనసాగిస్తూ వస్తోంది. ఆస్ట్రేలియా 131 రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానంలో నిలవగా, 119 పాయింట్లతో దక్షిణాఫ్రికా రెండో స్థానంలో ఉంది. 104 పాయింట్లతో భారత్ మూడో స్థానాన్ని దక్కించుకుంది. ఇంగ్లాండ్-102, న్యూజిలాండ్- 101 పాయింట్లతో నాలుగు, అయిదు స్థానాల్లో నిలిచాయి. పాకిస్థాన్ 89 రేటింగ్ పాయింట్లతో ఆరో స్థానానికి చేరుకోవడానికి ఎగబాకింది. మిగిలిన జట్లలో శ్రీలంక 86 పాయింట్లతో ఏడు, వెస్టిండీస్ 68 పాయింట్లతో ఎనిమిది, బంగ్లాదేశ్ 67 పాయింట్లతో తొమ్మిదో స్థానంలో ఉన్నాయి. ఐర్లాండ్- 25 పాయింట్లతో పదో స్థానానికి చేరింది. జింబాబ్వే- 10 పాయింట్లతో 11, ఆఫ్ఘనిస్తాన్ జీరో రేటింగ్‌తో చివరి స్థానంలో కొనసాగుతోంది. ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలోనూ ఆస్ట్రేలియాదే ఆధిపత్యం. ఆ జట్టు 87.50 శాతంతో టాప్ లో ఉంది. న్యూజిలాండ్- 77.78, సౌత్ ఆఫ్రికా- 75, శ్రీలంక- 66.67, పాకిస్తాన్- 50, భారత్- 48.15, ఇంగ్లాండ్- 31.67, బంగ్లాదేశ్- 16.67, వెస్టిండీస్- 4.17 శాతం పాయింట్లో ఉన్నాయి. భారత్ కంటే పాకిస్తాన్ మెరుగ్గా ఉండటం ప్రాధాన్యతను సంతరించుకుంది.




# జూన్ 4కు ఫిక్స్ అయిన 'పెద్ది' రిలీజ్..

## -మెగా ఫ్యాన్స్‌కు సర్‌ప్రైజ్ గిఫ్ట్!




టాలీవుడ్‌లో ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న భారీ ప్రాజెక్ట్ 'పెద్ది' విడుదల తేదీ ఎట్టకేలకు ఫిక్స్ అయింది. మొదటగా ఈ సినిమాను మార్చి 17న రిలీజ్ చేస్తామని మేకర్స్ ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే అనివార్య కారణాల వల్ల ఆ తేదీని ఏప్రిల్ 30కి వాయిదా వేశారు. ఆ సమయంలో కూడా అభిమానులు పెద్దగా నిరాశ చెందకుండా "ఒక నెల ఆలస్యమే కదా" అంటూ ఓపిక పట్టారు. కానీ విడుదలకు దగ్గరపడుతున్న సమయంలో మళ్లీ సినిమాను జూన్‌కు పోస్ట్‌పోన్ అవుతుందని ప్రచారం జరగడంతో మెగా అభిమానుల్లో తీవ్ర నిరాశ నెలకొంది.ఇక తాజాగా ఈ అనిశ్చితికి తెరదించుతూ మేకర్స్ కొత్త రిలీజ్ డేట్‌ను ప్రకటించారు. 'పెద్ది' సినిమాను జూన్ 4న థియేటర్లలో విడుదల చేయనున్నట్లు అధికారికంగా వెల్లడించారు. ఆసక్తికర విషయం ఏమిటంటే, అదే రోజున విడుదల కావాల్సిన 'టాక్సిక్' సినిమా ఆగస్టుకు వాయిదా పడటంతో ఆ స్లాట్‌ను 'పెద్ది' టీమ్ స్మార్ట్‌గా బుక్ చేసుకుంది. ఇప్పటికే ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఫస్ట్ లుక్, ఫస్ట్ షాట్ విడుదలైనప్పటి నుంచి అభిమానుల్లో ఉత్సాహం రెట్టింపు అయింది. ముఖ్యంగా రామ్ చరణ్ లుక్ చూసిన తర్వాత ఫ్యాన్స్‌లో ఎగ్జైట్‌మెంట్ పీక్స్‌కు చేరుకుంది. దర్శకుడు బుచ్చి బాబు సనా ఈ సినిమాలో చరణ్‌ను పూర్తిగా కొత్తగా, రఫ్ అండ్ రగ్గడ్ లుక్‌లో చూపిస్తున్నాడు. సినిమా నుంచి విడుదలైన 'చికిరీ' సాంగ్ దేశవ్యాప్తంగా సెన్సేషన్ సృష్టించింది. మొదట్లో మిక్స్‌డ్ రెస్పాన్స్ వచ్చినా, తరువాత అదే పాట మిలియన్ల వ్యూస్ దక్కించుకొని, సోషల్ మీడియాలో లక్షల రీల్స్‌తో వైరల్ అయింది. అలాగే 'రై రై రారా' పాట కూడా ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది. 'ఉప్పెన' సినిమాతోనే రూ.100 కోట్ల క్లబ్‌లో చేరి ఓవర్‌నైట్ స్టార్ డైరెక్టర్‌గా పేరు తెచ్చుకున్న బుచ్చి బాబు సనా, ఈ సినిమాతో మరింత భారీ హిట్ అందుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు. ఈ ప్రాజెక్ట్ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతుండగా, కథలో భావోద్వేగాలు, యాక్షన్ ఎలిమెంట్స్‌కు సమాన ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ చిత్రానికి ప్రముఖ దర్శకుడు సుకుమార్ సహ నిర్మాతగా వ్యవహరిస్తుండటం మరో విశేషం. ఇక నటీనటుల విషయానికి వస్తే, శివ రాజ్‌కుమార్, జగపతి బాబు, దివ్యేందు వంటి ప్రముఖులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. సంగీతాన్ని ఆస్కార్ విజేత ఏ.ఆర్ రెహమాన్ అందిస్తుండటంతో ఆల్బమ్‌పై కూడా భారీ అంచనాలు నెలకొన్నాయి. పలుమార్లు వాయిదాలు పడ్డా, చివరకు జూన్ 4కు ఫిక్స్ అయిన 'పెద్ది' సినిమా మెగా అభిమానులకు భారీ ట్రీట్ ఇవ్వబోతుందనే నమ్మకం వ్యక్తమవుతోంది. ఇప్పుడు అందరి దృష్టి ఈ సినిమా ఫస్ట్ డే కలెక్షన్లు, బాక్సాఫీస్ రికార్డులపైనే ఉంది.

# ఓటిటిలోకీ ఎంట్రీ ఇచ్చిన రాకాస




యంగ్ హీరో సంగీత్ శోభన్ ప్రధాన పాత్రలో, నయన్ సారిక హీరోయిన్‌గా నటించిన హారర్ కామెడీ చిత్రం రాకాస ఇప్పుడు ఓటీటీలోకి వచ్చేసింది. దర్శకురాలు మానస శర్మ తెరకెక్కించిన ఈ చిత్రం థియేటర్లలో మంచి స్పందన అందుకున్న తర్వాత డిజిటల్ స్ట్రీమింగ్‌కు సిద్ధమైంది. చిన్న సినిమాగా వచ్చినప్పటికీ, మంచి నిర్మాణ విలువలు, వినోదాత్మక కథతో ప్రేక్షకులను ఆకట్టుకున్న 'రాకాస' ఇప్పుడు నెట్‌ఫ్లిక్స్ వేదికగా నేటి నుంచి స్ట్రీమింగ్ అవుతోంది. థియేటర్లలో మిస్ అయిన వారు ఇప్పుడు ఈ సినిమాను ఇంటి వద్దే ఆస్వాదించే అవకాశం పొందుతున్నారు. ఈ సినిమా హారర్ ఎలిమెంట్స్‌తో పాటు కామెడీ మేళవింపుతో అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా రూపొందించబడింది. ముఖ్యంగా ఫ్యామిలీ ఆడియన్స్, పిల్లలతో కలిసి చూసేందుకు సరదాగా ఉండే కంటెంట్‌గా ఇది నిలుస్తుందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. వీకెండ్ లేదా హాలిడే టైంలో ఫ్యామిలీతో కలిసి చూడడానికి ఇది మంచి ఆప్షన్‌గా చెప్పవచ్చు.ఈ చిత్రాన్ని నిహారిక కొణిదెల సమర్పించగా, జీ స్టూడియోస్ నిర్మాణ బాధ్యతలు చేపట్టింది. టెక్నికల్‌గా కూడా సినిమా మంచి స్థాయిలో ఉండటం, వినోదాన్ని అందించే కథా రూపకల్పన ఉండటం ఈ చిత్రానికి ప్లస్‌గా మారాయి.

మొత్తానికి థియేటర్లలో మంచి టాక్ తెచ్చుకున్న 'రాకాస' ఇప్పుడు ఓటీటీలో మరింత విస్తృతమైన ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమైందని చెప్పాలి. హారర్ కామెడీ జానర్‌ను ఇష్టపడే వారికి ఈ సినిమా బెస్ట్ ఆప్షన్‌గా నిలుస్తోంది.ప్రముఖ ఓటీటీ దిగ్గజం నెట్‌ఫ్లిక్స్ భారీ ధరకు ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను దక్కించుకున్నట్టు తెలుస్తుంది.మెగా డాటర్ నిహారిక కొణిదెల తన హోమ్ బ్యానర్ పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ ద్వారా ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఈ చిత్రానికి మానస శర్మ దర్శకత్వం వహించారు. హారర్ ఎలిమెంట్స్‌కు స్వచ్ఛమైన కామెడీని జోడించి రూపొందించిన ఈ కథాంశం అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంది. ముఖ్యంగా వెన్నెల కిషోర్, బ్రహ్మాజీ, గెటప్ శ్రీనుల కామెడీ టైమింగ్ సినిమాకు ప్రధాన బలంగా నిలిచింది.

# పెద్ది'లో శృతి హాసన్ స్పెషల్ సాంగ్ ..

## ఒక్క పాటకే అన్ని కోట్ల రెమ్యునరేషన్ తీసుకుందా?



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, దర్శకుడు బుచ్చిబాబు సాన కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న పెద్దిపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఉత్తరాంధ్ర నేపథ్యంతో రూపొందుతున్న ఈ స్పోర్ట్స్ డ్రామా గురించి మరో ఆసక్తికరమైన వార్త ఇప్పుడు సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ సినిమాలో ఒక స్పెషల్ మాస్ సాంగ్ కోసం గ్లామర్ స్టార్ శృతి హాసన్‌ని ఎంపిక చేసినట్లు సమాచారం. అయితే ఈ పాట కోసం ఆమె తీసుకుంటున్న పారితోషికం మరింత సంచలనంగా మారింది. సాధారణంగా హీరోయిన్‌గా చేస్తే ఆమె దాదాపు రూ.3 కోట్ల లోపు రెమ్యునరేషన్ తీసుకుంటారని తెలిసినా, 'పెద్ది'లో కేవలం ఒకే ఒక్క పాట కోసం రూ.3.5 కోట్ల వరకు తీసుకుంటున్నట్లు ఇండస్ట్రీ టాక్.హీరోయిన్‌గా ఒక సినిమాకు నెల రోజుల వరకు కాల్షీట్లు ఇవ్వాల్సి ఉండగా, స్పెషల్ సాంగ్ కోసం కేవలం 4--5 రోజుల్లో షూటింగ్ పూర్తవుతుంది. తక్కువ సమయంలో ఎక్కువ రెమ్యునరేషన్ అందుకోవడం వల్ల ఇది శృతి హాసన్‌కు 'బంపర్ ఆఫర్'గా భావిస్తున్నారు సినీ విశ్లేషకులు. మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, గతంలో రామ్ చరణ్ -- శృతి హాసన్ కలిసి నటించిన ఎవడు బ్లాక్‌బస్టర్ హిట్ సాధించింది. అదే సెంటిమెంట్‌ను దృష్టిలో పెట్టుకుని ఈ పాట కోసం చరణ్ స్వయంగా శృతిని సూచించినట్లు ప్రచారం జరుగుతోంది. చరణ్ ఎనర్జిటిక్ డ్యాన్స్‌కు శృతి హాసన్ గ్లామర్ తోడైతే ఈ పాట థియేటర్లలో హైలైట్‌గా నిలుస్తుందని మేకర్స్ భావిస్తున్నారు. ఈ స్పెషల్ సాంగ్‌కు సంగీతాన్ని ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ అందిస్తున్నారని సమాచారం. ఉత్తరాంధ్ర యాసలో సాగే పక్కా మాస్ నంబర్‌గా ఈ పాట రూపొందుతోందని తెలుస్తోంది. హైదరాబాద్ సమీపంలోని జన్వాడలో వేసిన భారీ సెట్‌లో ప్రస్తుతం ఈ పాట చిత్రీకరణ జరుగుతోందని టాక్. గతంలో తమన్నా భాటియా, పూజా హెగ్డే వంటి స్టార్ హీరోయిన్లు స్పెషల్ సాంగ్స్ కోసం భారీ పారితోషికాలు తీసుకున్నారు. ఇప్పుడు శృతి హాసన్ వారిని మించి టాలీవుడ్‌లో అత్యంత ఖరీదైన స్పెషల్ సాంగ్ చేసిన నటిగా నిలిచే అవకాశం కనిపిస్తోంది. అధికారిక ప్రకటన రాకపోయినా, ఈ సినిమా జూన్‌లో విడుదలకు సిద్ధమవుతోందని సమాచారం. ఒకే పాటతో ఇంతటి చర్చ జరగడం 'పెద్ది' సినిమాపై ఉన్న క్రేజ్‌కు నిదర్శనంగా భావిస్తున్నారు సినీ వర్గాలు.

# ది ప్యారడైజ్ నుంచి మరో పాట విడుదలకు రెడీ




'ది ప్యారడైజ్' చిత్రంతో ప్రేక్షకుల్ని అలరించేందుకు సిద్ధమవుతున్నారు కథానాయకుడు నాని. ఆయన నటిస్తున్న ఈ పాన్ ఇండియా సినిమాని శ్రీకాంత్ ఓదెల తెరకెక్కిస్తున్నారు. సుధాకర్ చెరుకూరి నిర్మాత. కయాదు లోహర్ కథానాయిక. మోహన్‌బాబు, రాఘవ్ జుయల్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి బయటకొచ్చిన ఆయా షేర్. పాటకి ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ దక్కిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఇందులోని రెండో గీతాన్ని విడుదల చేసేందుకు చిత్ర బృందం సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. మే రెండో వారంలో దీన్ని బయటకు వదలనున్నారని.. ఇదో ప్రేమ గీతంగా ఉండనుందని సమాచారం. పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా ముస్తాబవుతున్న ఈ సినిమాని ఆగస్టు 21న థియేటర్లలోకి తీసుకు రానున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. దీనికి తగ్గట్లుగానే మే చివరి నాటికి చిత్రీకరణ పూర్తి చేయాలన్న లక్ష్యంతో చిత్ర బృందం షూటింగ్‌ను పరుగులు పెట్టిస్తోంది. ఈ చిత్రానికి అనిరుధ్ సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com